

అక్షరాభ్యాసం చేయించిన కేఎంసీ కమిషనర్



ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్6(ఆంధ్రజ్యోతి): మీరు నా అంత స్థాయిలోకి రావాలి.. ఐఏఎస్ అధికారులు కావాలంటూ ఓ ఐఏఎస్ అధికారి పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. శుక్రవారం ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య 60వ డివిజన్‌లోని మల్లేమడుగులో క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లారు. అంగన్వాడీ కేంద్రంలో బడిబాట కార్యక్రమం జరుగుతుండటంతో కమిషనర్ అక్కడకు చేరుకున్నారు. రావుల పూజన్, సిలివేరు చిన్నయ్‌శ్రీలకు స్వయంగా పలక బలపం పట్టి అక్షరాభ్యాసం చేశారు.



సైకిల్ ర్యాలీలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

మత్తుకు బానిస అవుతున్న యువత

» డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

నేలకొండపల్లి, జూన్6 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్, మద్యంలాంటి మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారుతున్నారని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలపై యువతను చైతన్యం చేయటానికి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గతనెల30న చేపట్టిన సైకిల్ యాత్ర శుక్రవారం మధ్యాహ్నం నేలకొండపల్లికి చేరింది.డీవైఎఫ్ఐ సైకిల్‌యాత్రకు స్థానిక డీవైఎఫ్ఐ,సీపీఎం కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం సైకిల్ యాత్రనుద్దేశించి డీవైఎఫ్ఐ రాష్ట్రఅధ్యక్షుడు కోటా రమేష్ మాట్లాడుతూ యువత మత్తుకు, ఆన్‌లైన్ బెట్టింగుల పాలు గాకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలుచేపట్టాలని డిమాండ్ చేశారు. గంజాయి, డ్రగ్స్ మాఫియా వలలో పడి నిర్వీర్యమై పోతున్నారన్నారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు సన్నగిల్లటంతోనే పెడ మార్గం పడుతున్నారన్నారు. రాజేశ్వరపురంలో అంబేద్కర్ విగ్రహానికి డీవైఎఫ్ఐ నాయకులు పూలమాల లేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.బషీరుద్దీన్, మద్దాల ప్రభాకర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రాసాల నవీన్, బొడ్డు మధు, సీఐటీయూ నాయకుడు పగిడికత్తుల నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు కట్టికోల వెంకన కేవీచారి, దుగ్గినర్సింహారావు, ఏటుకూరి రామారావు, దండా సూర్యనారాయణ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో ముందస్తు ప్రణాళిక అవసరం

ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ గౌతమ్

ఖమ్మంరూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా ముంపు ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలపై ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో మండలంలోని రాజీవ్‌గృహకల్ప, అర్బన్, ప్రకాష్‌నగర్, తిరుమలాయపాలెం మండలంలోని ఎర్రగడ్డ, రాకాసి తండా ప్రాంతాల్లో వరదపై అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా మునిసిపల్ పరిధిలోని జలగంనగర్‌లోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం వరదల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై స్థానికులకు అవగాహన కల్పించారు. గత సెప్టెంబరులో మున్నేరు ముంపు కారణంగా బాధితులు ఎదుర్కోన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరదల సమయంలో మనల్ని మనం కాపాడుకుంటూనే ఇతరలను కాపాడాలన్నారు.



మాట్లాడుతున్న గౌతమ్

వరదలు చెప్పి రావని మనమే అప్రమత్తంగా ఉండాలన్నారు. విలువైన ఆస్తి పత్రాలు, సర్టిఫికెట్లు, బంగారు ఆభరణాలు, డబ్బులు భద్రపరుచుకోవాలన్నారు. వరదల సమయంలో వాటిని వెంట తీసుకుని వెళ్లాలని సూచించారు. ముంపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కాలనీ వాసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహరావు, డీఈవో సామినేని సత్యనారాయణ, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్డీవో నరసింహారావు

ఖమ్మంరూరల్, జూన్6(ఆంధ్రజ్యోతి): భూభారతి గ్రామ సభలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో నరసింహరావు సూచించారు. మండల పరిధిలోని ఆరెకోడు గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో దరఖాస్తులు స్వీకరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, ఆర్ఐలు ప్రసాద్, వసంత పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: భూ భారతి చట్టం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని తహసీల్దార్ లూథర్ విల్సన్ పేర్కొన్నారు. శుక్రవారం జూపెడ, వెదుళ్లచెరువు రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించారు. 135మంది వివిధ భూ సమస్యలపై దరఖాస్తుచేశారు. జూపెడలో 122 మంది దరఖాస్తు చేశారు.ఈ కార్యక్రమంలో డీటీ జి.సుధీర్, ఆర్ఐలు లక్ష్మణ్,ఆర్. వీరయ్య, జోత్స్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఖమ్మంలీగల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం న్యాయసేవాధికార సంస్థ ప్రాంగణంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ సేవా సంస్థ కార్యదర్శిసీనియర్ సివిల్ జడ్జి కె.చంద్రశేఖరరావు, మొబైల్ కోర్టు న్యాయమూర్తి బి.నాగలక్ష్మి మొక్కలు నాటారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతని, మానవులంతా ఆరోగ్యంగా ఉండాలంటే చెట్లు నాటకం ఒకటే మార్గమని, నాటిన మొక్కలను పరిరక్షించడం, కాలుష్యాన్ని నివారించడం, జీవవైవిధ్యం కాపాడటం, భవిష్యత్ తరాల కోసం పర్యావరణ పరిరక్షణ తప్పనిసరని ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది మువ్వా నాగేశ్వరరావు న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల ఆందోళన

అనర్హులకు ఇచ్చారని నిరసన



కూసుమంచి, జూన్6(ఆంధ్రజ్యోతి): అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని గట్టుసింగారం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు కూసుమంచిలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు ఆ పార్టీకి అనుకూలంగా ఉన్నవారికి, భూములు ఉన్నవారికి ఇళ్లు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇదేమిటని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తే విచారణ చేస్తున్నాం.. అంటూనే ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోస్తున్నారని తెలిపారు. గట్టిగా అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇటీవల గ్రామానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశామని, విచారణ జరిపి అర్హులకే కేటాయించాలని అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో ఎంపీడీవో వేణుగోపాలరెడ్డికి వినతిపత్రం అందించారు.

యుగంధర్‌ను కలిసిన నాయకులు

నేలకొండపల్లి, జూన్6(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్‌ను మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్, టీడీపీ, తుమ్మల సోషల్ మీడియా నాయకులు ఖమ్మంలోని తుమ్మల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.యుగంధర్ వారి యోగ, క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీని బలోపేతం చేయటానికి కృషి చేయాలని, ఎప్పుడూ ప్రజలతో మమేకమై పని చేయాలని సూచించారు. కాంగ్రెస్‌కు చెందిన కొమ్మూరి నరేష్,రావెళ్ళశ్రీనివాసరావు,కొమ్మూరి ప్రసాద్, తెలుగుదేశం గువ్వలగూడెంగ్రామశాఖా అధ్యక్షుడు కోలేటి మస్తాన్‌రావుతో పాటుగా తుమ్మ శీనన్న సోషల్ మీడియా సైనికులు యుగంధర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



యుగంధర్‌ను కలిసిన కాంగ్రెస్, టీడీపీ నాయకులు

డిగ్రీ విద్యార్థులకు అందుబాటులో వసతి గృహాలు

» నేలకొండపల్లి మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పరంజ్యోతి

నేలకొండపల్లి,జూన్6(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని మోడల్ డిగ్రీకళాశాలలో చేరే విద్యార్థులకు వసతి గృహాలు అందుబాటులోకి వచ్చాయని మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆలేటి పరంజ్యోతి చెప్పారు. వసతిగృహాలను నిర్మించిన కాంట్రాక్టర్ నుంచి శుక్రవారం హాస్టల్ భవనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరం నుంచి అన్ని వసతులతో కూడిన వసతి గృహాలు వేర్వేరుగా ప్రారంభిస్తున్నామన్నారు. కళాశాల ప్రాంగణంలోనే రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ రూసా నిధులతో హాస్టల్స్ నిర్మాణం పూర్తి చేసి, అందుబాటులోకి తెచ్చామన్నారు. హాస్టల్లో నూతనంగా అడ్మిషన్ పొందే ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేద విద్యార్థులందరూ వసతి గృహంలో సీట్లు పొందవచ్చన్నారు. నేలకొండపల్లి డిగ్రీకళాశాల మోడల్ డిగ్రీ కళాశాల గావటంతో అన్ని వసతులున్నాయని, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని చెప్పారు. దోస్తుద్వారా డిగ్రీలోఅడ్మిషన్లు పొంది, తమ బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలని ప్రిన్సిపాల్ పరంజ్యోతి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, ఉపసంచాలకులు కె.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరెడ్డి, రూసా కో-ఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసరావు, దోస్త్‌కో-ఆర్డినేటర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



భవనాలను స్వాధీనం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ పరంజ్యోతి

ఉబ్బసానికి శాస్త్రీయ వైద్యం అందించటమే కర్తవ్యం

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్6 (ఆంధ్రజ్యోతి): ఉబ్బసానికి చేప ప్రసాదం వల్ల ఎటాంటి ఉపయోగం లేదని, దీని వల్ల అనేక దుష్ఫలితాలు జరుగుతాయని నగరానికి చెందిన పలువురు వైద్యులు పేర్కోన్నారు. శుక్రవారం జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని యుటీఎఫ్ భవన్‌లో చేప ప్రసాదం, ఉబ్బసానికి మందు కాదు అనే అంశంపై రౌంటేబుల్ సమాశం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు ఇ.భారవి, ఎస్. వెంకటేశ్వర్లు, ఎస్‌పివి. గణేష్బఆబు, ధనమూర్తి, గోపగాని. సురేందర్ పాల్గొని మాట్లాడారు.

దివ్యాంగుడికి ఉపాధి చూపిన ప్రజావాణి

» ఏడేళ్లుగా ఉపాధి కోసం పోరాడిన వీరబాబు
» అండగా నిలిచిన కమిషనర్ అభిషేక్ అగస్త్య
» కేఎంసీలో జీరాక్స్ సెంటర్‌ను ప్రారంభించిన మేయర్ నీరజ





వీరబాబు వినతి వింటున్న కమిషనర్ అభిషేక్, జీరాక్స్ సెంటర్ ప్రారంభిస్తున్న మేయర్

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్6(ఆంధ్రజ్యోతి): అంగవైకల్యాన్ని జయించి ఆ యువకుడు ఎంఏ ఎకనామిక్స్ పూర్తి చేశాడు. కానీ తాను ఆశించినట్లుగా ఉద్యోగం రాలేదు. ఈనేపథ్యంలో ఉపాధి కోసం ఏడేళ్లుగా ప్రభుత్వ ఉన్నతాధికారులు చుట్టూ ప్రదీక్షణలు చేశారు. చివరకు ప్రస్తుత కేఎంసీ కమిషనర్ అండగా నిలిచారు. ఉపాధి కల్పించారు. వర్దేబోయిన వీరబాబు 2018లోనే ఎంఏ పూర్తి చేశాడు. ఖమ్మం నగర పాలక సంస్థలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఇటీవల దివ్యాంగుడు వీరబాబు హాజరై తన విద్యాపత్రాలను కుటుంబ పరిస్థితిని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు చెప్పుకున్నారు. దీంతో స్పందించిన కమిషనర్ దివ్యాంగుడుకు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో మీ సేవా కేంద్రం వద్ద జీరాక్స్ సెంటర్ ఏర్పాటుకు మెప్మా అధికారులను ఆదేశించారు. స్పందించిన మెప్మా అధికారులు స్థలం చూపించారు. స్నేహితులు, బంధువులు సహకారంతో జీరాక్స్ కేంద్రాన్ని సమకూర్చుకున్నారు. అయితే వీరబాబు ఇప్పటికే ఠాగూర్ దివ్యాంగుల సమాఖ్య సభ్యుడుగా ఉండటంతో ఆమేరకు బ్యాంకర్లతో మాట్లాడి మెప్మా టీఎంసీ సుజాతరాణి వీరబాబుకు బ్యాంకు రుణాన్ని అందించేందుకు కార్యచరణ చేశారు. కేఎంసీ కార్యాలయంలో వీరబాబు జీరాక్స్ కేంద్రాన్ని మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం ప్రారంభించారు. ఉద్యాన అధికారి బెల్లం రాధిక, డీఈ శ్రీనివాసరావు, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, ఏవో శ్రీకాంత్, సీవో చిలకా ద్రౌపది, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు కల్లేపల్లి జ్యోతి, మీసేవా జిల్లా సమన్వయకర్త యుగంధర్, ఆర్పీలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కేఎంసీ అధికారులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో అధికారుల కొరత తీరింది. కేఎంసీలో ఎకౌంట్స్ ఆఫీసర్‌గా డిప్యూటేషన్‌పై పనిచేసిన శివలింగం వరంగల్‌కు వెళ్లగా ఖాళీ ఏర్పడింది. అయితే ఇల్లెందు మునిసిపాలిటీలో ఏవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఖమ్మం నగర పాలక సంస్థ ఏవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మేయర్ పునుకొల్లు నీరజను కలిసి పూల మొక్కను అందించారు. కేఎంసీ ఆర్వోగా పనిచేసిన జీ.శ్రీనివాసరావును మహబూబాబాద్ బదిలీ చేశారు. అక్కడ నుంచి శ్రీధర్ ఖమ్మానికి వచ్చారు. పదిరోజులైన శ్రీధర్ తన విధుల్లో చేరలేదు. బదిలీ ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో నెరేడుచర్ల మునిసిపాలిటీలో పని చేస్తున్న యాకూబ్‌పాషాకు మూడు రోజుల క్రితం ఖమ్మం నగర పాలక సంస్థకు బదిలీ జరిగింది. దీంతో బాధ్యతలు స్వీకరించారు.





యాకూబ్‌పాషా, శ్రీనివాసరెడ్డి

స్నేహితుడికి అండగా పూర్వవిద్యార్థులు

కూసుమంచి,జూన్6(ఆంధ్రజ్యోతి): తమతో చదివిన బాల్యమిత్రుడు కష్టాల్లో ఉన్నాడని తెలిసి అండగా నిలిచారు పూర్వవిద్యార్థులు.. కూసుమంచి మండల కేంద్రంలో జడ్పీఉన్నత పాఠశాల 1988-89 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన నలగాటి వీరయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న పూర్వవిద్యార్థులు సోషల్‌మీడియా వాట్సాప్ వేదికగా రూ.36వేలు సేకరించారు. అసుపత్రికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. నగదు అందజేశారు.



నగదు అందిస్తున్న పూర్వవిద్యార్థులు

ప్రతీ ఫిర్యాదుకు స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

» 'ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్'తో క్షేత్రస్థాయిలోకి అధికారులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమంతో ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లారు. రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, పారిశుధ్య ఇతర విభాగాల అధికారులు తమ పరిధిలోని ఫిర్యాదులపై స్పందించారు. శుక్రవారం ఉదయం విభాగాల వారీగా మరోసారి ఫిర్యాదుదారులకు అధికారులు ఫోన్లు చేశారు. వారి నివాస వివరాలను తెలుసుకొని క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. అక్రమ నిర్మాణాలు, భూఅక్రమణలు, పారిశుధ్య పనులు, అధికంగా ఇంటి నెంబర్లు నమోదు, వీధిదీపాలు ఏర్పాటు నుంచి విద్యుత్ స్థంబాలు ఏర్పాటు వరకు సంబందిత విభాగాల అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో ఫిర్యాదుదారులు హర్షం ప్రకటించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.



భూఅక్రమణలపై విచారణ జరుపుతున్న దృశ్యం

వృద్ధుడి బలవన్మరణం

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్6 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం భార్య మృతి చెందటంతో మద్యానికి బానిసై మనోవేదనతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఖమ్మం ఖానాపురంహవేలి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు అయింది. రఘునాథపాలెం మండలం వివెంకటాయపాలెం గ్రామానికి చెందిన బి.లాల్య(70) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండేళ్ల క్రితం భార్య మృతి చెందటంతో మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం ఇంటినుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడు. ఈక్రమంలో నగరంలోని వెలుగుమట్ల వద్ద గల సాగర్ కాలువ డీప్‌కట్‌లో లాల్య మృతదేహాన్ని గుర్తించారు. మృతుడికి కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అన్నం శ్రీనివాసరావు మృతదేహాన్ని బయిటకు తీశారు.

బాధిత కుటుంబాలకు నగదు అందజేత

నేలకొండపల్లి, జూన్6(ఆంధ్రజ్యోతి): మృతుల కుటుంబాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందిస్తున్న నగదు సాయాన్ని శుక్రవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేల చొప్పున కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొడాలి గోవిందరావు ఆధ్వర్యంలో అందజేశారు. మండలంలోని గువ్వలగూడెం, ముజ్జుగూడెం, అనాసాగరం, మంగాపురంతండా, రాయగూడెం,బుద్దారం, చెర్వుమాధారం, భైరవునిపల్లి, రాజేశ్వరపురం గ్రామాల్లో బాధితులకు అసాయాన్ని అందించారు. కార్యక్రమంలో వేగినాటి లక్ష్మీనర్సయ్య, శాఖమూరి రమేష్, కుక్కల హనుమంతరావు, మామిడి వెంకన్న, దండా సత్యనారాయణ, ఆరెకట్ల గురవయ్య, గోళ్ళ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రక్తదాన శిబిరం



ఖమ్మంఖానాపురంహవేలి జూన్6 (ఆంధ్రజ్యోతి): తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులకు ఉపయోగపడేలా రక్తదాన శిబిరం నిర్వహించామని వత్సవాయి రవి అన్నారు. శుక్రవారం రవి జన్మదినం సందర్బంగా బాలాజీ ఎస్టేట్స్ కార్యాలయంలో సంకల్ప స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించాన రక్తదాన శిబిరంలో సంస్థ మార్కెటింగ్ సిబ్బంది, ఉద్యోగులు సుమారు రెండు వందల మంది రక్తదానం చేశారని తెలిపారు. పుట్టిన రోజు సందర్బంగా రక్తదానం చేయటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రేణుక, మాజీ ఎంపీపీ గోసు. మధు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడిబాట ర్యాలీ

తిరుమలాయపాలెం, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పిండిప్రోలు, జల్లేపల్లి, తిరుమలాయపాలెం, తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు జ్యోతి, రాజేష్, వాలి, లతాకుమారి, సుజాత, వసంత, నీలమ్మ,కవిత, పాల్గొన్నారు.



అనాథ చిన్నారుల ఆనందోత్సాహం

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్6 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచనలతో ఖమ్మంలోని జలకన్యల ఎగ్జిబిషన్‌కు 30మంది అనాథాశ్రమం పిల్లలకు అవకాశం దక్కింది. శుక్రవారం ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలోని ఈ ఎగ్జిబిషన్‌లో వారు సంతోషంగా గడిపారు. నీటిలో పలు విన్యాసాలు చేసిన జలకన్యలను చూశారు. తర్వాత పలు రకాల యంత్రాలపై ఉచితంగా ప్రయాణించి సంతోషించారు. నిర్వాహకులు తుమ్మా అప్పిరెడ్డి, అమర్లపూడి జాల సౌరి, వాసు, మహేష్ సహకరించారు.



ప్రతీ సమస్యను పరిష్కరిస్తా: మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్, జూన్6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తల్లంపాడు గ్రామంలో ప్రతీ సమస్యను విడతల వారీగా పరిష్కరిస్తానని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తల్లంపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి పొంగులేటి నివాసంలో ఆయనను కలిశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో గ్రామఅధ్యక్షుడు అంబేద్కర్, నాయకులు సత్యనారాయణ, లింగయ్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పొంగులేటితో కాంగ్రెస్ నాయకులు

ఆపత్కాలం.. అప్రమత్తత అవసరం

- ప్రమాదకరంగా ఇనుప స్టార్టర్ బాక్సులు
- విద్యుత్ సరఫరాతో ప్రమాదాలకు ఆస్కారం



ఖమ్మం వ్యవసాయం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బోరు, వ్యవసాయ బావుల మోటార్ల వద్ద కరెంట్ షాక్ తగిలే ప్రమాదాలు ఎక్కువగా వానాకాలం ప్రారంభం లోనే చూస్తుంటాం. కారణం వేసవి పంటల తర్వాత భూగర్భ జలాలు తగ్గిపోవడంతో దాదాపు రెండు నెలల పాటు పంట విరామం ఉంటుంది. ఈ సమయంలో ఈదురుగాలులు, అకాల వర్షాలతో తీగలు తెగిపోవడం, కనెక్షన్ వదులుగా మారి మోటార్లు, బాక్సులకు విద్యుత్తు సరఫరా కావడం వంటివి జరుగుతుంటాయి. ఈ సమయంలో అన్నదాతలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి.

సొంత మరమ్మతులు వద్దు..

ఈదురు గాలులతో కురిసే వర్షాలకు స్తంభాలు ఓ వైపు వంగడం, కూలడం జరుగుతుంది. స్తంభం నుంచి బోరుకు వచ్చే సర్వీసు వైర్లు తెగిపోయే ప్రమాదం ఉంటుంది. వాటి పరిసరాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా గమనించాలి. తెగిన వైర్లు గమనిస్తే తక్షణమే అధికారులకు సమాచారం అందించి సరఫరా నిలిపివేయించాలి. సంబంధిత సిబ్బందితో మాత్రమే మరమ్మతులు చేయించుకోవాలి.

మోటార్ల వద్ద ఇలా..

బోరు మోటార్లు ఆన్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. మూతలు లేని స్టార్టర్లు, ఇనుప డబ్బాలతో ప్రమాదం పొంచి ఉంటుంది. కొన్నిసార్లు తీగలు, ఫ్యూజ్‌లు తెగిపోయి ఉంటాయి. తరచూ వాటిని పరిశీలించాలి. మూతలు లేకపోతే వర్షం పడినప్పుడు లోపలి భాగం తడిసిపోతుంది. ఆ సమయంలో బోరు వేయకపోవడమే ఉత్తమం. సాధారణ సమయాల్లోనూ డబ్బా దగ్గరకు వెళ్లినప్పుడు కాళ్లకు చెప్పులు, చేతి తొడుగులు ధరించాలి. నాణ్యమైన ప్లాస్టిక్ డబ్బాలు మాత్రమే వాడటం ఉత్తమం. బోరు బావుల్లో కంపెనీ మోటార్లే వాడాలి. ఒకవేళ కాలిపోయినా విద్యుత్తు సరఫరా కాదు. ప్రైవేటు వ్యక్తుల వద్ద తక్కువ ధరకే వచ్చినా.. అవి కాలిన సందర్భాల్లో పైపుల వరకు విద్యుత్ సరఫరా అయి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్



బూర్గంపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం పర్యటనకు విచ్చేసిన తెలంగాణ హైకోర్టు జడ్జి భీమపాక నగేష్‌ను శుక్రవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక ఐటీసీ గెస్ట్‌హౌజ్‌లో జడ్జిని కలిసిన కలెక్టర్ ఆయనకు పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులపై చర్చించుకున్నారు.

బడి ఈడు పిల్లలను సర్కారు బళ్లో చేర్పించాలి

- ఈ విద్యా సంవత్సరం నుంచి నవోదయ పాఠశాల ప్రారంభం
- బడిబాట ప్రారంభంలో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ఖమ్మం జిల్లాలో తొలిరోజు అమ్మ ఆదర్శ కమిటీ సమావేశాలు

కరకగూడెం/ఖమ్మం ఖానాపురం హవేలీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, అందుకు ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం కరకగూడెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంఈవో గడ్డం మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. అనవసరంగా డబ్బులు ఖర్చు చేసి విద్యను కొనుక్కోవలసిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి పాఠశాలలను బలోపేతం చేయవలసిన అవసరం ఉందన్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉచిత వైద్య పరీక్షలు అత్యున్నత విద్యార్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన వంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. అనంతరం జవహర్ నవోదయ పాఠశాల మరమ్మతులను పరిశీలించిన కలెక్టర్ 10వ తేదీ లోపు పాఠశాల మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా డీఎల్‌పీవో సుధీర్, ఎంపీడీవో కుమార్, ఎంఈవో గడ్డం మంజుల, ఎంపీవో మారుతి, విద్యాశాఖ డీఈ నాగేశ్వరచారి, ఏఈ శ్రీను, పీఆర్ డీఈ రామనాధం, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, అంగన్‌వాడీ టీచర్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాలో తొలిరోజు అమ్మ ఆదర్శ కమిటీ సమావేశాలు

ఖమ్మంరూరల్ మండలం నాయుడుపేటలో పాల్గొన్న డీఈవో

ఖమ్మం జిల్లావ్యాప్తంగా శుక్రవారం బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. తొలి రోజు జిల్లాలోని అన్ని పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీల సమావేశాలు నిర్వహించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. ఖమ్మంరూరల్ మండలం నాయుడుపేట సమావేశానికి జిల్లా విద్యాశాఖ అధికారి కె.సత్యనారాయణ హాజరై మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు, బడిఈడు పిల్లలను బడిలో చేర్పించుట, ప్రభుత్వ బడిలో కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలు వివరించాలన్నారు. ప్రతి పాఠశాలలో బడి బాట ర్యాలీలు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, రెండు జతల యూనిఫాం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఆంగ్ల విద్యను ఉచితంగా అందించటం జరుగుతుందని అన్నారు. బడిబాటలో చేరిన విద్యార్థులు పాఠశాలలకు వచ్చే విధంగా చూడాలని అందుకు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో చేరితే లభించే సౌకర్యాల గురించి వివరించాలని సూచించారు.చింతకాని మండలం ప్రొద్దుటూరులో విద్యాశాఖ సీఎంవో రాజశేఖర్ పాల్గొని బడిబాట కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామాలో బడిఈడు పిల్లలను తప్పని సరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు.



బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భద్రాద్రి కలెక్టర్



నాయుడుపేట బడిబాట గ్రామ సభలో మాట్లాడుతున్న డీఈవో



చింతకాని మండలం ప్రొద్దుటూరులో పాల్గొన్న విద్యాశాఖ సీఎంఓ రాజశేఖర్

ఇప్పగింజలను పరిశీలించిన కలెక్టర్

ఆదివాసీ పిల్లలకు నోటు పుస్తకాలు పెన్నులు అందించిన కలెక్టర్



కరకగూడెం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కరకగూడెం మండలం కన్నాగూడెం పంచాయతీ బంగారుగూడెం ప్రధాన రహదారిపై ఆదివాసీలు సేకరించిన ఇప్ప గింజలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి అటవీ ఉత్పత్తుల వివరాలు తెలుసుకున్నారు. ఇప్పగింజల నుంచి నూనె ఎలా తయారు చేస్తారు. ఇప్ప పూలు ఎన్ని విధాలుగా ఉపయోగిస్తారు అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులతో మమేకమైన కలెక్టర్ వారితో ముచ్చటించారు. చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు. దీంతో గ్రామస్థులు, చిన్నారులు ఆనందం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్‌రెడ్డి

ప్రజా వ్యతిరేక ప్రభుత్వం ఇది

- కాంగ్రెస్ పాలనలో అయోమయంలో రాష్ట్ర ప్రజానీకం
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి

ఖమ్మం మార్కెట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వం అధికారంలో ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజలు అయోమయం జగన్నాథంలో ఉన్నారని, అభివృద్ధిని కోరుకుంటున్న ప్రజలకు గుండు సున్నా చూపిస్తున్నారని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన క్యాబినెట్ సమావేశంలో యువ వికాసం, విద్యారంగ సమస్యలపై ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదని విమర్శించారు. ఉద్యోగాల నోటిఫికేషన్లు లేవని, యూత్ డిక్లరేషన్ ఊసే లేదని, పీఆర్సీ ప్రస్తావన లేదని అన్నారు. నిరుద్యోగ యువతకు, ఉద్యోగస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాజీవ్ వికాస పథకానికి 16.22 లక్షల దరఖాస్తులు వచ్చాయని అది వికాసం చెందక ముందే విధ్వంసం అయిందని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎక్కడ మీటింగ్ పెట్టినా 60 వేల ఉద్యోగాలు నేనే ఇచ్చానని అబద్ధాన్ని గొప్పలు చెప్పుకుంటున్నారని, బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌లకు మాత్రమే ఆయన అపాయిట్‌మెంట్ లెటర్లు ఇచ్చారని అన్నారు. సమావేశంలో నాయకులు ఉప్పల వెంకటరమణ, బిచ్చాల తిరుమలరావు, గుండ్లపల్లి శేషగిరిరావు, బొమ్మెర రామ్మూర్తి, రసూల్, బంక మల్లయ్య, అనంతరాములు, ఉమాశంకర్, వంశీ, వీరబాబు ఉన్నారు.

డ్రోన్ ట్రైనింగ్, ఈవీ వెహికల్ మెకానిజంలో ఉచిత శిక్షణలు

- 12 లోగా దరఖాస్తులు అందించాలి
- మహిళా అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి
- మహిళా ప్రాంగణం అధికారి విజేత

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టేకులపల్లి లోగల మహిళా ప్రాంగణంలో డ్రోన్ ట్రైనింగ్, ఈవీ వెహికల్ మెకానిజంలో ఉచిత శిక్షణలు ప్రారంభం కానున్నాయని మహిళా ప్రాంగణం అధికారి వేల్పుల విజేత శుక్రవారం తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులకు ఈ శిక్షణ ఇప్పించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. ఆసక్తి కల ఐటీఐ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తు ఫారాలను ఈ నెల 9 నుంచి 12వ తేదీలోగా మహిళా ప్రాంగణం కార్యాలయం, టేకులపల్లి, ఖమ్మం నందు అందించాలని తెలిపారు. అప్లికేషన్‌తోపాటు విద్యార్హత, ఐటీఐ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్ కార్డు, మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరచాలని తెలిపారు. కలెక్టర్ అనుమతితో, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ సహకారంతో ఈ వినూత్న ట్రైనింగ్‌లను ఏర్పాట్లు చేసినట్లుగా తెలిపారు. శిక్షణ కాలవ్యవధి నెలరోజులు. 30 సీట్లు మాత్రమే ఉండటంతో అభ్యర్థుల ఎంపిక మెరిట్ ఆధారంగా ఉంటుందన్నారు. శిక్షణలు పూర్తిగా ఉచితం. నిరుద్యోగ యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయ్..

(5వ పేజీ తరువాయి)

ఇంటర్ సిలబస్ చెబుతుండటంతో రెండిటిని చదవలేక ఎంతో మంది విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమతులు లేని అకాడమీలు, ఇంటర్ కళాశాలల్లో చదివే విద్యార్థులను ఉదయం 4 గంటలకే నిద్ర లేపి, రాత్రి 11 గంటల వరకు అకాడమీ చదువులు, ఇంటర్మీడియట్ సిలబస్ చదివిస్తూ రోజుకు సుమారు 18 గంటలు కేవలం చదివే ప్రామాణికంగా ఉండటంతో కొందరు విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారనే వాదనలు వినపడుతున్నాయి. తెల్లవారు జామున 4 గంటల నుంచి పాఠాలు, టెస్టులు, రివిజన్ అంటూ విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. వీరికి సెలవులు, పండుగలు ఏమీ ఉండవు. ఎంబీబీఎస్, ఐఐటీల్లో అడ్మిషన్లు రావాలంటే కష్టపడి చదవాలని చెబుతూ వారిపై మానసికంగా మరింత భారం మోపుతున్నారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక అకాడమీలలో విద్యార్థులు ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్న పరిస్థితి ఉంది. ఇందుకు నగరంలోని ఓ అకాడమీలో గత ఏడాది చదివిన ఓ విద్యార్థి ఇంటి వద్ద ఆత్మహత్య చేసుకున్న సంఘటనే ఉదాహరణ. ఈ అకాడమీలపై అజమాయిషీని ఇంటర్ బోర్డు పరిధిలోకి తెచ్చి ఫీజుల నియంత్రణ చేయాలని, చదువు పేరుతో విద్యార్థులపై పెడుతున్న ఒత్తిడిని నియంత్రించేలా ప్రత్యేక చట్టం చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. అకాడమీ పేరుతో నిర్వహించే విద్యాసంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టి మరే ఇతర అనుమతులు ఇవ్వకుండా నిషేధించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నగరంలో నిర్వహించే అకాడమీల్లో చేరుతున్న వారిలో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలే ఉంటున్నారు.

అకాడమీల నిర్వాహకులు చెప్పే మాటలు నమ్మి పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఇవ్వాలన్న తాపత్రయం, ఆత్రుతతో పిల్లలను వాటిలో చేర్పి చేతులు కాల్చుకుంటున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు, అకాడమీల్లో చదువులు

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన కొందరు విద్యార్థులు నగరంలోని పలు మెడికల్ అకాడమీల్లో ఇంటర్ విద్యతోపాటు, మెడికల్ లాంగ్ టర్మ్ శిక్షణ తీసుకుంటున్నారు. కానీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచితంగా అడ్మిషన్ల పొంది అక్కడ చదువుకోవాల్సిన విద్యార్థులకు ఆశలు చూపి అకాడమీ నిర్వాహకులు తమ వైపునకు తిప్పుకొని ఇంటర్, లాంగ్ టర్మ్ కోచింగ్‌ల పేరుతో రూ.లక్షల్లో ఫీజులు వసూళ్లు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు వచ్చినట్టు చూపుతున్న అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు.. ఆ విద్యార్థులు అకాడమీలకు వెళుతుంటే.. ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నగరంలోని ఓ మెడికల్ అకాడమీ నిర్వాహకులు తిరుమలాయపాలెం మండలంలోని ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు.. కళాశాలకు వెళ్లకుండానే అదే కళాశాల హాల్‌టికెట్‌తో పరీక్ష రాసిన సంఘటన ఇందుకు ఉదాహరణ. ఇలా మరికొన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు పలు అకాడమీల్లో ఇంటర్మీడియట్ తరగతులకు హాజరై, నీట్, ఎప్‌సెట్ కోచింగ్ తీసుకుంటున్నారని సమాచారం.

అకాడమీల్లో ఇంటర్ తరగతులకు అనుమతుల్లేవు

కె.రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

ఖమ్మం జిల్లాలో ఉన్న మెడికల్ అకాడమీల్లో ఇంటర్ తరగతుల నిర్వహణకు బోర్డు నుంచి ఎలాంటి అనుమతులు లేవు. ప్రతీ ప్రవేటు జూనియర్ కళాశాల ఇంటర్ అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేని కళాశాలలపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు, వారి తల్లితండ్రులు అనుమతులున్న జూనియర్ కళాశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలి. అందుకు ముందుగానే అనుమతులున్నాయో లేవో తెలుసుకోవాలి. నగరంలో నిర్వహించే అకాడమీలకు ఇంటర్ బోర్డుకు సంబంధం లేదు. అది మా పరిధి కాదు. అకాడమీల్లో అనుమతులు లేకుండా ఇంటర్ క్లాసులు నిర్వహిస్తే మాత్రం తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

మూలాల శోధన.. అరెస్టులతో సాధన!

(5వ పేజీ తరువాయి)



నిందితుడిని చూపుతున్న సైబర్‌క్రైం పోలీసులు(ఫైల్)

అకౌంట్లకు అడ్డుకట్ట వేసిన అనంతరం సైబర్ నేరగాళ్లను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. అందులో భాగంగా ఈ ఏడాది ప్రారంభం నుంచి ఆరు కేసులకు సంబంధించి ఇప్పటి వరకు 13మందిని అరెస్టు చేసి రిమాండ్ చేయడం కొసమెరుపు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి మరీ ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు అరెస్టులు చేస్తున్న సంఘటనలు ఈ కోవకు చెందినవే.

అనధికారిక వెబ్‌సైట్లతోనే అనర్థాలు..

ఉద్యోగాల కోసం ఇంటర్‌నెట్‌లో వెతికే సందర్భంలో పలు జాగ్రత్తలు తీసుకోకపోవడం కూడా సైబర్ వలలో పడటానికి ఓ కారణంగా కనిపిస్తోంది. అనధికారిక వెబ్‌సైట్లలో పార్ట్ టైం, ఫుల్ టైం, వర్క్ ఫ్రం హోమ్ లాంటి వివరాలను వెతుకుతూ ఎవరైతే ఆయా వెబ్‌సైట్లలో లాగిన్ అవుతారో వారి సమాచారాన్ని కేటుగాళ్లు దొంగిలిస్తున్నారు. ఆ తర్వాత నేరుగా ఆయా వ్యక్తులకు ఫోన్లు చేయడం లేదా? సామాజిక మాధ్యమాల ద్వారా సందేశాలు పంపడం లాంటివి చేస్తూ ఉంటారు. ఆ సమయంలో ఎవరైతే స్పందిస్తారో వారికి ఇంటి దగ్గరే కూర్చుని పనిచేసుకోవచ్చని, ఎంత సమయం పనిచేస్తే అంత ఎక్కువ సంపాదించొచ్చంటూ వ్యక్తిగత సమాచారం కూపీ లాగుతూ బాధితులను వారి వలలోకి లాగుతారు. వాటి ద్వారా రోజుకు రూ.2వేల నుంచి రూ. 6వేల వరకు సంపాదించే అవకాశం ఉందని ఒక్కో నేరస్థుల ముఠా ఒక్కో రకమైన ఆఫర్లు ఇస్తారు. అలా సామాజిక మాధ్యమాల్లోని సబ్‌స్క్రిప్షన్ చేసుకోవాలని కొందరు, టాస్కలను పూర్తి చేయాలని మరికొందరు, ట్రేడింగ్ బిజినెస్ అని ఇంకొందరు.. ఇలా పేరు ఏదైనా వారి టార్గెట్ మాత్రం బాధితుల నుంచి స్వయంగా తామే నేరగాళ్ల అకౌంట్లలోకి నగదు బదిలీ చేసేలా ప్రణాళిక రచిస్తున్నారు. అలా ఏటా సాధారణ దొంగతనాల్లో బాధితులు నష్టపోయిన నగదు కంటే సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్న నగదు మూడింతలు ఎక్కువగా ఉంటుంది. ఆయా నేరగాళ్ల వలలో పడి నగదు పోగొట్టుకున్నట్టు వెంటనే గ్రహించి సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా ఎక్కువ మొత్తంలో నగదు హోల్డ్ చేసే అవకాశం ఉన్నా.. బాధితులు ఆలస్యంగా ఫిర్యాదులు చేస్తుండటంతో అప్పటికే సైబర్ నేరగాళ్లు ఆయా నగదును దారిమళ్లిస్తున్నారు.

రిమాండ్‌కు తరలించిన కేసుల్లో కొన్ని..

● ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ ఇన్‌వెస్ట్‌మెంట్‌లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి రూ. 1.62 కోట్లు మోసం చేసినట్టు బోనకల్లు మండలానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. అందులో ముగ్గురిని ఏపీలో అరెస్ట్ చేయగా.. మరొకరిని సిద్ధిపేట జిల్లాలో అరెస్ట్ చేశారు.

● ముంబయి పోలీసులమని చెప్పి మనీ లాండరింగ్ కేసులో అరెస్ట్ చేస్తామని ఖమ్మం నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించి రూ.1.12 కోట్లు దోచుకున్న కేసులో ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు కర్ణాటక వెళ్లి మరీ సైబర్ నేరస్థుడిని అరెస్ట్ చేశారు. ట్రాన్సిట్ వారెంట్ ద్వారా కర్ణాటకలోని హుబ్లీలో అరెస్టు చేసిన అనంతరం ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరుపరిచి రిమాండ్ చేశారు.

● ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి ఖమ్మంలోని ఓ రిటైర్డ్ ఉద్యోగి వద్ద కేర్ టేకర్‌గా ఉన్న ఓ యువకుడు.. యజమానికి తెలియకుండా బెట్టింగ్ అకౌంట్‌కు రూ.11.49లక్షలు బదిలీ చేయగా.. సదరు ఉద్యోగి ఫిర్యాదు మేరకు మధిర మండలంలో సదరు యువకుడిని అరెస్ట్ చేశారు.

● ఆన్‌లైన్‌లో ప్రైవేట్ ఉద్యోగం ఇస్తామనీ, ఆ తర్వాత ఇన్వెస్ట్‌మెంట్ పెడితే ఎక్కువ డబ్బులు వస్తాయని నమ్మించి హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి మరికొంత మంది వ్యక్తులతో కలిసి ఖమ్మానికి చెందిన వ్యక్తిని మోసగించి రూ.9.25లక్షలు దోచుకోగా.. సదరు కేసులో ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. మరో కేసులో బాధితులకు తెలియకుండా తమ అకౌంట్లోకి రూ. 11.49 లక్షలను కాజేయగా రంగారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు.



నిందితుడిని చూపుతున్న దృశ్యం(ఫైల్)

విచారణ ఏదీ?

(5వ పేజీ తరువాయి)



చిన్నగా నిర్మిస్తున్న వంటగది

హడావుడిగా ప్రారంభించారు. ఆయా పనులు కూడా ఆర్‌అండ్‌బీ, సంబంధిత అధికారి వచ్చి పర్యవేక్షణ చేసిన దాఖలు లేవు. దీంతో కూలీలే ఇంజనీర్లుగా మారి పనులు నిర్వహిస్తున్నారు. ఇంజనీర్ల పర్యవేక్షణ లేకపోవడంతో నిర్మాణ ప్లాన్ ప్రకారం కాకుండా ఇష్టారీతిన కొలతలతో నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో నిర్మించాల్సిన వంట గదిని ఏకంగా ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్నారు. వంట గది కనీసం బాత్‌రూమ్ పరిమాణంలో కూడా లేకపోవడంతో ఉపాధ్యాయులు, గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆయా నిర్మాణాల్లో నాణ్యత పాటించడం లేదని, నాసిరకం ఇటుకలు వాడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై డీఆర్‌డీఏ పీడీ విద్యాచందనను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా మర్కోడు ఎంపీపీఎస్ పాఠశాల నిధుల వ్యవహారం ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా తెలుసుకొని కలెక్టర్‌కు దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

అటకెక్కిన పునరావాస ప్రతిపాదన

- వరదలొచ్చినప్పుడే అధికారులు హడావిడి
- ముంపు బాధితులకు ఇళ్ల స్థలాలు కలేనా

దుమ్ముగూడెం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదలకు సర్వం కోల్పోతున్న కుటుంబాలకు ప్రభుత్వ ఆసరా కరువైంది. పునరావాసం పట్ల వరదముంపు సమయంలో మాత్రమే హడావిడి చేసే అధికారులు ఆ తర్వాత వారి సంక్షేమానికి అవసరమైన ప్రతిపాదనలను అటకెక్కిస్తున్నారు. ఏటా మండలంలోని పలు గ్రామాలు గోదావరి వరద ముంపు సమస్యతో ఇబ్బందులు పడుతుండగా, నదీతీరాన జీవిస్తున్న కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంది. మండల వ్యాప్తంగా మొత్తం ఇరవైనాల్గు గ్రామాలపై గోదావరి వరదల ప్రభావం పడుతోండగా, వాటిలో ముఖ్యంగా నాలుగైదు గ్రామాలు అతలాకుతలం అవుతున్నాయి. 1986, 1990, 2013, 2022ల్లో బీభత్సం సృష్టించిన వరదలకు సున్నంబట్టి, దుమ్ముగూడెం, వర్కుషాపు, కాశీనగరం, బైరాగులపాడు గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. చివరిగా 2022 జూలైలో వరద విలయతాండవానికి సున్నంబట్టి, కాశీనగరం, వర్కుషాపు గ్రామాల ప్రజలు సర్వం కోల్పోయారు. వరదల సమయంలో పర్యటిస్తున్న మంత్రులు, అధికారులు బాధితులకు ఇస్తున్న హామీలు ఏళ్లు గడిచినా కార్యరూపం దాల్చడం లేదు.



సున్నంబట్టిలో ముంపునకు గురైన ఇల్లు



పునరావాస కేంద్రానికి వెళ్తున్న మహిళలు(ఫైల్)

స్థలాల కేటాయింపు మరిచారు..

2022లో గోదావరి వరదలకు అధికారుల లెక్కల ప్రకారం మండలంలోని 1936 కుటుంబాలు నిర్వాసితులయ్యారు. కాశీనగరం, సున్నంబట్టిలతోపాటు దుమ్ముగూడెం పంచాయతీ ఆవాసప్రాంతం వర్కుషాపుల్లో గృహాలు పూర్తిగా ముంపుకు గురయ్యాయి. కాశీనగరం, సున్నంబట్టి గ్రామాల్లోని గృహాలు నామరూపాలు లేకుండా కొట్టుకుపోయాయి. మూడు గ్రామాల బాధితుల పునరావాసం కోసం మైదాన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు 2022 ఆగస్టులో నాటి కలక్టర్ అనుదీప్ మండలంలోని పలు ప్రభుత్వ ఖాళీ స్థలాలను పరిశీలించారు. రామచంద్రాపురం సర్వే నెంబరు 32-3లో పదిహేను ఎకరాలు, దుమ్ముగూడెం సర్వే నెంబరు 170లో ఒక ఎకరం, 176లో నాలుగు ఎకరాల ఇరవై నాల్గు కుంటలు, చినబండిరేవులో ఇరవై ఎకరాలు, అంజుబాకలో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను పరిశీలించారు.

స్థలాల కేటాయింపునకు సంబంధించిన ఫైలు కూడా తయారవగా, నేటికీ స్థలాల మంజూరుకు మోక్షం దక్కలేదు. వరదలు వచ్చినప్పుడు బాధితులకు పదో పరకో సాయమందించి చేతులు దులుపుకొంటున్న ప్రభుత్వాలు, ఆ తర్వాత వారి బాగోగులను పూర్తిగా గాలికొదిలేసిందనే ఆరోపణలున్నాయి.

విమానం ఎక్కామోచ్..!

- తొలిసారి ఫ్లైట్ జర్నీ చేసిన పదో తరగతి టాపర్లు
- ఢిల్లీ పర్యటనకు తీసుకెళ్లిన మిత్రా ఫౌండేషన్
- సంతోషం వ్యక్తం చేసిన ప్రభుత్వ పాఠశాలల చిన్నారులు





మూడు రోజుల పర్యటనలో భాగంగా విమాన ప్రయాణం చేసిన పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

ఖమ్మం గాంధీ చౌక్, జూన్6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఆరుగురు విద్యార్థులు జిల్లా కేంద్రంలోని శ్రీమిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3వ తేదీన ప్రారంభమైన మూడు రోజుల ఢిల్లీ పర్యటన గురువారం రాత్రి పూర్తవగా చిరస్మరణీయ అనుభవాలు పొందారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, ఆశయాలను పెంపొందించేందుకు ఫౌండేషన్ చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల జీవితాల్లో ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది. ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్ నాయకత్వంలోని మిత్ర ఫౌండేషన్ ఇచ్చిన ప్రకటనకు స్పందించిన విద్యార్థులు, కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ విజయానికి గుర్తింపుగా వారిని విమానంలో ఢిల్లీకి తీసుకెళ్లి చారిత్రక ప్రదేశాల సందర్శనతో పాటు వివిధ కీలక కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పించారు. పార్లమెంట్ భవనం, రాష్ట్రపతి భవన్, అక్షరధామ్, ఎర్రకోట, ఇండియా గేట్, సైన్స్ మ్యూజియం తదితర ప్రదేశాలను సందర్శించారు. తొలిసారిగా విమాన ప్రయాణం చేసిన వీరికి అది ఒక అనిర్వచనీయ అనుభూతిగా మిగిలింది.

ఢిల్లీలో విద్యార్థులు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి గంగవరపు కిషన్ రెడ్డితో ముఖాముఖిలో పాల్గొన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన నివాసంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మంత్రి ఈ కార్యక్రమానికి స్ఫూర్తిగా నిలిచిన మిత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు కురువేళ్ల ప్రవీణ్‌ను అభినందించి, ప్రత్యేకంగా సత్కరించారు. విద్యార్థుల పర్యటనకు డీఈవో సామినేని సత్యనారాయణ సహకారం అందించారు. ఈ పర్యటనలో విద్యార్థులకు ఏర్పాట్లు చేసి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు మిత్ర ఫౌండేషన్, విద్యార్థుల ధన్యవాదాలు తెలియజేశారు. ఫౌండేషన్ కార్యదర్శులు శ్రీరంగ శ్రీనివాస్, నాగరాజు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు జిల్లాలోని ఇతర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తాయని, విద్యార్థుల అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో, కురువెళ్ల ప్రవీణ్, మిత్రా ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు

లా సెట్‌కు హాజరైన ఎమ్మెల్యే జారే



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న ఎమ్మెల్యే

అశ్వారావుపేట రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): న్యాయరంగంపై ఉన్న ఆసక్తితో శుక్రవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ లాసెట్‌కు హాజరయ్యారు. హైదరాబాదులో జరిగిన ప్రవేశ పరీక్షకు రెండు రోజులుగా ప్రిపేర్ అవుతూ ప్రవేశ పరీక్ష రాశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ న్యాయ విద్య అంటే తనకు చిన్ననాటి నుంచి ఇష్టం అని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సహాయం చేయాలనే ఆలోచనతోనే న్యాయ విద్యను అభ్యసించాలనుకుంటున్నట్లు తెలిపారు.

గోదావరిలో యువకుడి గల్లంతు

బూర్గంపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి గోదావరిలో గురువారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. సారపాకకు చెందిన ఐటీసీ కాంట్రాక్టు కార్మికుడు భోగపతి సావంత్(24) గురువారం తన స్నేహితుడితో కలిసి ఇరవెండి వద్ద గోదావరిలో స్నానానికి వెళ్లారు. స్నానం చేస్తున్న క్రమంలో సావంత్ గల్లంతయ్యారు. ఈ విషయాన్ని సావంత్ స్నేహితుడు గ్రామస్థులకు, కుటుంబసభ్యులకు తెలిపారు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం పోలీసులు గజ ఈతగాళ్ల, రెస్క్యూటీమ్‌తో గాలింపు చర్యలు చేపట్టిన ఫలితం లేదు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 26 మందికి జరిమానా

కొత్తగూడెం లీగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 26మందికి కొత్తగూడెం కోర్టులో జరిమాన విధిస్తూ స్పెషల్ జ్యూడిషయల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు శుక్రవారం తీర్పు చెప్పారు. పోలీసులు రహదారులపై బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా వేర్వేరు ప్రాంతాల్లో 26 మంది పట్టుబడినారు. కాగా వారిని కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం అంగీకరించి జరిమాన చెల్లించారు.

20 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

మధిరరూరల్, జూన్6(ఆంధ్రజ్యోతి): మాటూరుపేట గ్రామంలో కోళ్ల ఫారం షెడ్లలో నిల్వ చేసిన 20 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని శుక్రవారం మధిర రూరల్ పోలీసులు పట్టుకున్నారు. కోళ్లఫారంలో షెడ్లలో రేషన్‌బియ్యాన్ని నిల్వ చేసినట్లు మధిర రూరల్ పోలీసులకు సమాచారం అందింది. రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి తన సిబ్బందితో కలిసి వెళ్లి కోళ్లఫారంలో నిలవచేసిన ఉన్న 20 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



- నేడు ఈద్ ఉల్ అజ్‌హా
- ప్రార్థనలకు సిద్ధమైన మసీదులు, ఈద్గాహ్‌లు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 6:45గంటల నుంచి 8:30వరకు మసీదులు, ఈద్గాహ్‌ల వద్ద ఈదుల్ అజ్‌హా ప్రత్యేక నమాజును వేలాదిమంది ముస్లింలు ఆచరించనున్నారు. ఇందుకోసం మసీదులన్నీ ముస్తాబై ఉన్నాయి. ఖమ్మం నగరంలో గాంధీచౌక్, గొల్లగూడెం ఈద్గాలతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక నమాజులకు ఏర్పాటు పూర్తిచేశారు. త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్ పండుగలో ఖుర్బానీ చేసేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. నమాజు అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆలింగనం చేసుకుంటారు. తమ తాహతుకు తగ్గట్లు గొర్రెలు వంటి వాటిని ఖుర్బానీ చేసి ఆ మాంసాన్ని పంచిపెట్టేందుకు పూర్తి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకొనే పండుగల్లో ముఖ్యమైనది బక్రీద్. ఇబ్రహీం అలైహిస్సలాం, ఆయన కుమారుడు ఇస్మాయిల్ అలైహిస్సలాం త్యాగస్మరణే శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్లింలు ఇదుల్ అజ్‌హా (బక్రీద్)ను జరుపుకొంటుంటారు.

బక్రీద్ విశిష్టత..

బక్రీద్ పండుగను ఈదుల్ అజ్‌హాగా పేర్కొంటారు. ఖుర్బానీ అంటే సమర్పణ, త్యాగం, బలి అని అర్థం. సుమారు 4వేల ఏళ్ల క్రితం ఇరాక్ దేశంలో పండిత కుటుంబంలో జన్మించిన దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీంకు(సల్లల్లాహు అలైహి వసల్లం) ఒకరోజున కల వచ్చింది. ఆ స్వప్నంలో 86 ఏళ్ల వృద్ధాప్యంలో జన్మించిన తన ఏకైన కుమారుడు ఇస్మాయిల్‌ను ఖుర్బానీ చేయాలని అల్లాహ్ ఆ కలలో ఇబ్రాహీంను ఆదేశించినట్లు కల సారాంశం. అల్లాహ్ ఆదేశానుసారం తన కుమారుడిని బలి ఇవ్వడం కోసం సిద్ధం కాగా అల్లాహ్ దాన్ని స్వీకరించి ఇస్మాయిల్‌కు బదులు స్వర్గం నుంచి ఓ పొట్టేలు (దుంబా)ను పంపి ఖుర్బానీ చేయడమే ఈ పండుగ ప్రత్యేకత.

ఖుర్బానీ ప్రాముఖ్యత..

ఇబ్రాహీం త్యాగానికి ప్రతిఫలంగా ప్రాప్తించిన ఈ పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు. ఈదుల్ అజ్‌హా ప్రత్యేక నమాజు అనంతరం ఖుర్బానీ చేస్తారు. ఆర్థికంగా ఉన్నవారు ఒంటరిగా గొర్రె, మేకపోతులను దానం చేస్తారు. మధ్యతరగతి కొందరు కలిసి మాంసాన్ని ఖుర్బానీ చేసి మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒకటి పేదలకు, మరొకటి బంధువులకు ఇస్తారు. ఇంకో వాటాను తమ ఇంటికి ఉపయోగించుకుంటారు. బక్రీద్ పండుగ అనేది త్యాగానికి ప్రతీక. ఖుర్బానీ అంటే జంతుబలి కాదు, మానవుడు దైవమార్గంలో తన సర్వస్వాన్ని త్యజిస్తానని చేసే ప్రకటన మాత్రమే. దైవాన్ని విశ్వసించడం, మానవులంతా ఒకటేనని నమ్మాలి. చెడును నిరోధించడం, మంచిని పెంచడం, కష్టాలలో సహనం వహిస్తూ, త్యాగ నిరతిని చూపించాలన్న సందేశమే ఖుర్బానీలో దాగి ఉంది.

పటిష్ఠ బందోబస్తు

- పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



ఖమ్మం, జూన్6(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినాలను కులమతాలకు అతీతంగా సోదరభావంతో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ శాంతియుత వాతావరణంలో పండుగ వేడుకలను జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. త్యాగానికి ప్రతీకగా ముస్లింలు జరుపుకొనే బక్రీద్ పండుగ కోసం పోలీస్ అధికారులు అన్ని భద్రత ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తెలిపారు. మునిసిపల్, వెటర్నరీ, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందుకెళ్తున్నామన్నారు. ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొనే సామూహిక ప్రార్థన కార్యక్రమాల సమయంల్లో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇప్పటికే ప్రధాన కూడళ్లలో పోలీస్ పికెట్లు, పర్యవేక్షణ, నిఘా వ్యవస్థను అప్రమత్తం చేశామన్నారు. మసీదులు, దేవాలయాలు, చర్చిల వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమణ రవాణా నివారించడానికి, చట్ట విరుద్ధ చర్యల కట్టడికి ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువుల అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని, ఎవరైనా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.



పాలేరులోని నవోదయ విద్యాలయం

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కూసుమంచి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో ఉన్నత విద్యను అందించేందుకు పాలేరులో ఏర్పాటు చేసిన జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 సంవత్సరానికిగాను ఆరోతరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, క్రీడలు, సాంస్కృతి కరంగాలు, ఉన్నత విద్యావకాశాలు ఇక్కడి ప్రత్యేకత. పాలేరు జలాశయం సమీపంలో చక్కటి ఆహ్లాదకర వాతావరణంలో గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటుచేశారు. ప్రారంభించిన నాటినుండి ఆశించిన ఫలితాలను సాధిస్తుండగా నానాటికి ఆదరణ పెరుగుతోంది. సీబీఎస్ఈ విధానంలో ఆరో తరగతి నుంచి ప్లస్2 వరకు ఆంగ్లమాధ్యమంలో విద్యబోధిస్తున్నారు. ఆరోతరగతి నుంచి 10వ తరగతి వరకు 80 మంది విద్యార్థుల చొప్పున, ప్లస్-1, ప్లస్-2 తరగతుల్లో 40 మంది విద్యార్థుల చొప్పున ప్రవేశం కల్పిస్తున్నారు. పాలేరు నవోదయలో వచ్చే ఏడాది 6వ తరగతిలో ప్రవేశానికిగాను దరాఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి కామన్ సర్వీస్ సెంటర్స్ (సీ.ఎస్.సీ ఆఫ్ మినిష్టి ఆఫ్ ఐటీ) ద్వారా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తు ఫారాన్ని నవోదయ సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు



బీమా చెక్కును అందజేస్తున్న సింగరేణి అధికారులు

సింగరేణిలో రూ. కోటి ప్రమాద బీమా చెక్కు అందజేత

రుద్రంపూర్, (సింగరేణి)జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ. కోటి చెక్కును శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు అందజేశారు. మణుగూరు ఏరియాలో ఈపీ ఆపరేటర్‌గా పని చేస్తున్న ముల్‌చంద్ విశ్వకర్మ నాలుగు నెలల క్రితం జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులకు రూ.కోటి చెక్కును అందజేసినట్లు సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం తెలిపారు. దేశ చరిత్రలో ప్రభుత్వరంగ సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు కోటిరూపాయల బీమా పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత సింగరేణి సంస్థకే దక్కుతుందన్నారు. సింగరేణి సంస్థ స్ఫూర్తితో మరిన్ని రాష్ట్రాల్లోని పలు పరిశ్రమల్లో ప్రమాద బీమాను అమలు చేసే విధంగా ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఇతర బ్యాంకులతో మాట్లాడి ప్రమాద బీమాను రూ.కోటి 25లక్షలకు పెంచేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లు, ఎస్‌బీఐ బ్యాంకు డీజీఎం సత్యనారాయణ, ఈఎంలు కవితానాయుడు, నికోలస్, జీవీ కిరణ్‌కుమార్, ఈఈసెల్ హెచ్‌వోడీ ఏజీఎం మురళీధర్, రమణమూర్తి, పీతాంబరం, సునీల్ వర్మ, మృతుడి సతీమణి హరిదేవి విశ్వకర్మ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

- పలువురికి గాయాలు
- కొణిజర్ల, నేలకొండపల్లి, కారేపల్లి, పాల్వంచ మండలాల్లో ఘటనలు

కొణిజర్ల/ నేలకొండపల్లి / కారేపలి/ పాల్వంచ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృతిచెందారు. పలువురికి గాయాలయ్యాయి. కొణిజర్ల, తనికెళ్ల గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో వేరుపుల వెంకన్న(50), నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం సమీపంలో ఆటో ప్రమాదంలో ఉమా మహేశ్వరరావు(70), కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో జరిగిన ట్రాలీ ప్రమాదంలో మేకల సీతమ్మ(40), పాల్వంచలో బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో కుంచాల సూర్యనారాయణ(48) మృతి చెందారు.

కోడిగుడ్ల ఆటో బోల్తా .. వ్యక్తి మృతి



ఉమా మహేశ్వరరావు

నేలకొండపల్లి మండల పరిధిలోని గంగమ్మ గుడి సమీపంలో శుక్రవారం ఉదయం కోడిగుడ్ల ఆటో బోల్తా కొట్టటంతో ఆటోను నడుపుతున్న కొండసాని ఉమామహేశ్వరరావు(70) అనే వ్యక్తి మృతి చెందాడు. నేలకొండపల్లికి చెందిన కొండసాని ఉమామహేశ్వరరావు ఆటో కొనుక్కుని కోడిగుడ్ల హోల్‌సేల్ వ్యాపారం చేస్తున్నాడు. కోడిగుడ్లను కొనుగోలు చేసి ఆటోలో తీసుకుని చుట్టు పక్కల గ్రామాల్లోని షాపులకు వేసి వస్తుంటాడు ఈనేపథ్యంలో శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో కోడిగుడ్లను ఆటోలో లోడు చేసుకుని ఖమ్మం వైపు వెళుతుండగా గువ్వలగూడెం సమీపంలోని గంగమ్మ గుడి, అండర్ బ్రిడ్జిని దాటిన అనంతరం ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొట్టినట్లుగా సమాచారం. దీంతో ఆటోలో నుంచి రోడ్డుపై పడిపోయిన ఉమామహేశ్వరరావు తలకు బలమైన గాయం తగిలాయి. జాతీయ రహదారికి చెందిన అంబులెన్సులో నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్సులో ఖమ్మం తరలించారు. ఖమ్మంలో చికిత్స పొందుతూ ఉమామహేశ్వరరావు మృతి చెందాడు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



క్రేన్ కింద పడి ధ్వంసం అయిన బైక్



మృతి చెందిన వెంకన్న

మూడు చోట్ల ప్రమాదాలు.. ఒకరి మృతి

కొణిజర్ల మండలంలో మూడు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా పలువురికి స్వల్ప గాయాలు అయిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని కొణిజర్ల, తనికెళ్ల గ్రామాల మధ్య రహదారిపై ఖమ్మం నుంచి వైరా వెళుతున్న ట్యాంకర్ ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు వేరుపుల వెంకన్న(50)కు తీవ్ర గాయలు అయ్యాయి. 108వాహనంలో ఖమ్మం తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వైరా నుంచి ఖమ్మం వస్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంతో ముందు వెళుతున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి. మండల కేంద్రమైన కొణిజర్ల సెంటర్‌లో ఖమ్మం నుంచి వైరా వైపు వెళుతున్న భద్రాచలం లాహిరి బస్సును కొణిజర్ల గ్రామం నుంచి రోడ్డుపైకి వస్తున్న ఎక్స్‌కవేటర్ క్రేన్ డ్రైవర్ ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా ఢీకొట్టాడు. క్రేన్ పల్టీ కొట్టగా రోడ్డు పక్కనే ఉన్న ద్విచక్రవాహనం పై పడటంతో దెబ్బతిన్నది. బస్సులో ప్రయాణికులు సురక్షితంగా ఉండగా బస్సు ముందు అద్దాలు ధ్వసం అయ్యాయి.

ఆటోట్రాలీని ఢీ కొట్టిన కారు

కారేపల్లి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లిలో గల కోటమైసమ్మ తల్లి ఆర్చీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతిచెందగా మరోఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఉసిరికాయలపల్లి గ్రామంలో నుంచి కారు రోడ్డుకు వస్తున్న క్రమంలో ఇల్లెందు వైపు నుంచి కారేపల్లి వైపునకు వస్తున్న ఆటోట్రాలీని ఢీకొంది. దీంతో ట్రాలీ ఆటోలో ఉన్నవారిలో మధిర పట్టణానికి చెందిన మేకల సీతమ్మ(40)సంఘటన స్థలంలోనే మృతి చెందింది. అదే ట్రాలీలో ఉన్న మంగమ్మ, సాయి అనే ఇద్దరుకు తీవ్రగాయాలు అయ్యాయి. మధర పట్టణం నుంచి ట్రాలీ ఆటోలో వచ్చి ప్లాసిక్ వస్తువులు, చిత్తుకాగితాలు సేకరించుకుని ఖమ్మం వెళుతున్న క్రమంలో ఇల్లెందు-కారేపల్లి ప్రధాన రాహదారిపై ప్రమాదం జరిగింది. ప్రమాద స్థలానికి సీఐ బి.తిరుపతిరెడ్డి,ఎస్ఐ.బి.గోపి వెళ్లి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి..



సూర్యనారాయణ

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి చెందిన సంఘటన పాల్వంచలో శుక్రవారం చోటు చేసుకుంది. పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామంలోని పెద్దమ్మగుడిలో కుంచాల సూర్యనారాయణ(48) రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం విధుల్లో భాగంగా బ్యాంకు పనిమీద పాల్వంచవైపు తన ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. లక్ష్మీదేవిపల్లి గ్రామ సమీపంలోకి రాగానే సారపాక నుంచి పాల్వంచ వైపు వస్తున్న లారీ అతి వేగంగా అతడి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో సూర్యనారాయణ అదుపు తప్పి రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయాలై రక్తస్రావం ఏర్పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ నిర్వహించి మృతదేహాన్ని పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ అనసూరి బాలకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాల్వంచ రూరల్ ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

132 కిలోల గంజాయి పట్టివేత

అశ్వాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతారామా కెనాల్ బ్రిడ్జివద్ద కారులో తరలిస్తున్న 132కిలోల గంజాయిని శుక్రవారం అశ్వాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. చింతూరు నుంచి కారులో మహారాష్ట్రలోని నాంథేడ్‌కు అక్రమంగా గంజాయిని కొందరు వ్యక్తులు తరలిస్తున్నారు. ఈమేరకు విశ్వసనీయ సమాచారంతో సీతారామా కెనాల్ వద్ద పోలీసులు కారును అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.66లక్షల20 వేలు ఉంటుందని ఎస్సై మధుప్రసాద్ తెలిపారు. గంజాయిని తరలిస్తున్న సిద్ధిపేటకు చెందిన పల్లెపు పరుశురాములను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.


దొంగ అనే అనుమానంతో వ్యక్తి నిర్బంధం

అశ్వారావుపేట రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి వేళ గ్రామంలో అనుమానా స్పందంగా సంచరిస్తున్న వృద్ధుడిని దొంగ అనే అనుమానంతో గ్రామస్థులు నిర్బంధించిన సంఘటన మండలంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. మండలంలోని వినాయకపురంలో గురువారం అర్ధరాత్రి సమయంలో దాదాపు 60ఏళ్ల వయస్సు ఉన్న వృద్ధుడు సంచరిస్తున్నాడు. ఇళ్ల మధ్య తిరుగుతూ ఉండటంతో అనుమానం వచ్చిన గ్రామస్థులు అతడిని నిర్బంధించి ప్రశ్నించారు. పొంతన లేని సమాధానాలు చెప్పటంతో పోలీసులకు సమాచారం అందించారు. అదనపు ఎస్ఐ రామ్మూర్తి వృద్ధుడిని స్టేషన్‌కు విచారించారు. అయితే సదరు వృద్ధుడు మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించి వదిలేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్‌కు గాయాలు

అశ్వారావుపేట రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రెండు లారీలు ఢీకొని రోడ్డుకు అడ్డంగా పడిపోగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన అశ్వారావుపేటలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాదు నుంచి ఆంధ్రాలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి సరుకుల లోడ్‌లో వెళుతున్న లారీ, ఏపీలోని రాజమండ్రి నుంచి సూర్యాపేటకు వెళుతున్న మరోలారీ పామాయిల్ పరిశ్రమ ఎదురుగా అదుపుతప్పి ఢీకొన్నాయి. ప్రమాదంలో తాడేపల్లిగూడెంకు చెందిన లారీ డ్రైవర్ నాగమల్లేశ్వరావుకు తీవ్రంగా గాయాలు కాగా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

ఉపాధికి ఊతం.. హెల్త్‌కేర్ కోర్సు



భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- భద్రాచలం డిగ్రీ కళాశాలలో ప్రత్యేక బీఎస్సీ
- యువతకు మెండుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

భద్రాచలం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఏజెన్సీలోని విద్యార్థులకు ఉద్యోగవకాశాలే కల్పనగా బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్మెంట్ కోర్సును భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశపెట్టారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్, కో-ఆర్డినేటర్ డా. జాన్‌మిల్టన్ తెలిపారు. వైద్యరంగంలో అనేక ఉపాధి అవకాశాలు లభిస్తున్న నేపథ్యంలో హెల్త్‌కేర్ మేనేజ్మెంట్ కోర్సు ఏజెన్సీ విద్యార్థులకు ఒక సువర్ణవకాశమనే చెప్పాలి. హెల్త్‌కేర్‌లో స్థిరపడాలి అనుకునే యువతకు బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్మెంట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. అటానమస్ గుర్తింపు పొందిన భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26కు సంబంధించి ఈ కోర్సు ప్రవేశపెట్టారు. దోస్తు విధానంతో ఈ కోర్సులో ప్రవేశాలను విద్యార్థులు పొందవచ్చు.

కోర్సు వివరాలు

బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్మెంట్ కోర్సు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ ప్రైవేటు ఆరోగ్య రక్షణ సంస్థలు, ఆస్పత్రి పాలనా విభాగం, ఆర్థిక నిర్వహణ వైద్య నైతిక విలువలు, ఆరోగ్య సమాచారం వ్యవస్థ నాణ్యత ప్రమాణాలు, ప్రజారోగ్య వ్యాధుల నియంత్రణ వ్యవస్థ తదితర అంశాలతో కోర్సును పొందుపరిచారు. ఇంటర్‌లో బైపీసీ లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉన్నవారు ఈ కోర్సుకు అర్హులు.

ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు

బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్మెంట్ కోర్సు పూర్తి చేసిన అనంతరం ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ కోర్సు అనంతరం ఎంబీఏ హస్పిటల్ మేనేజ్మెంట్, ఎంపీహెచ్ మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఎంఎస్సీ హెల్త్ అడ్మినేష్ట్రేషన్, పీజీ డిప్లొమా క్లినికల్ రీసెర్చ్ హెల్త్ ఎకనామిక్స్, హెల్త్ ఇన్ ఫార్మాటిక్స్ కోర్సులకు అవకాశం ఉంటుంది. ఈ కోర్సు మూడో సంవత్సరంలో అప్రెంటీస్ విధానం అమలులోకి వస్తుంది ఈ క్రమంలో రూ.9వేలు ప్రతి నెల భృతి కింద చెల్లిస్తారు. ఇందులో ప్రభుత్వం సదరు సంస్థ వాటా కింద 50శాతం చొప్పున చెల్లిస్తుంది. మూడేళ్ల కోర్సు పూర్తి అవగానే విద్యార్థుల నైపుణ్యం ఆధారంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి

డా.జాన్ మిల్టన్, ప్రిన్సిపాల్



ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు ఈ కోర్సును ఉపయోగించుకోవాలి. కోర్సు పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. హెల్త్ కేర్ రంగంలో స్థిరపడాలి అనుకునే యువత ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

'కొండను తవ్వి ఎలుకను పట్టిన' చందంగా ఉండేది ఒకప్పటి సైబర్ నేరాల ఛేదన పరిస్థితి. ఇక పోలీసులు ఎంతటి పెద్దమొత్తంలో సాంకేతికతను అందిపుచ్చుకుని పని చేసినా సైబర్ నేరగాళ్ల ఎత్తులకు ప్రజలు చిత్తు కావాల్సిన పరిస్థితులే ఎదురయ్యేవి. అలాగే సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నా.. కొందరు అత్యాశకు పోయి మరీ సైబర్ వలలో పడుతున్నారు. ఆయా కేసులను ఛేదించేందుకు గతంలో సైబర్ క్రైం పోలీసులు ఎన్నో వ్యయ ప్రయాసలకు గురయ్యేవారు. అంత చేసినా బాధితులు నష్టపోయిన మొత్తాన్ని తిరిగి అందించలేక.. వారికి సరైన న్యాయం చేయలేని పరిస్థితి. దాంతో సైబర్ క్రైం పోలీసులు మూలాల్లోకి వెళ్లి మరీ శోధిస్తున్నారు. నేరాలకు పాల్పడేందుకు అవకాశం లేకుండా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి మరీ నేరగాళ్లను అరెస్టు చేసి కటకటాల్లోకి పంపుతున్నారు. ఈ క్రమంలో సైబర్ నేరాలకు కొంతమేర అడ్డుకట్ట వేయొచ్చన్న యోచనతో ముందుకు సాగుతున్నట్టు తెలుస్తోంది.



మూలాల శోధన.. అరెస్టులతో సాధన!

సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసే దిశగా పకడ్బందీ చర్యలు

- ఏటా సాధారణ కేసుల కంటే 'సైబర్' నష్టాలే ఎక్కువ
- ఇతర రాష్ట్రాలకు వెళ్లి మరీ అరెస్టులు చేస్తున్న పోలీసులు
- ఈ ఏడాది ఇప్పటి వరకు పదిమందికిపైగానే కటకటాలపాలు



నేరస్థులను చూపుతున్న సైబర్ క్రైం పోలీసులు (ఫైల్)

ఖమ్మం, జూన్6 (ఆంధ్రజ్యోతి): ఏటికేడు సైబర్ నేరాల నష్టం సాధారణ దొంగతనాలకు మించి పోతున్నాయి. 2023లో 466 కేసులు నమోదవగా వాటిలో 241కేసులను పోలీసులు ఛేదించారు. ఆయా కేసుల్లో రూ.4.48 కోట్లు నష్టం జరగ్గా రూ.1.57కోట్లను రికవరీ చేశారు. 2024లో దొంగతనాల సంఖ్య 700 కు చేరగా.. వాటిల్లో 295 కేసులను ఛేదించారు. ఆయా దొంగతనాల్లో రూ.5.58కోట్లు నష్టం జరగ్గా రూ.1.55కోట్లను రికవరీ చేశారు. కానీ సైబర్ క్రైంకు సంబంధించి మాత్రం 2023లో 1,332 కేసులు నమోదవగా.. ఆయా నేరాల్లో బాధితులు రూ.9కోట్లు నష్టపోయారు. 2024లో 2,148 కేసులు నమోదవగా.. బాధితులు రూ. 34.92కోట్లు నష్టపోయారు. గత రెండేళ్లలో సాధారణ దొంగతనాల్లో ప్రజలు నష్టపోయిన సొమ్ము రూ.10కోట్లు మాత్రమే ఉండగా.. సైబర్ నేరగాళ్లు ఒక్క ఏడాది కాలంలో కొట్టేసిన సొమ్ము రూ. 34.92 కోట్లు ఉండటం గమనార్హం. ఇక ఈ ఏడాది ప్రారంభం నుంచి ఖమ్మం సైబర్ క్రైం స్టేషన్‌లో మొత్తం 17 కేసులు నమోదవగా అందులో రూ.3.76కోట్లు బాధితులు నష్టపోయారు. బాధితులు ఆలస్యంగా ఫిర్యాదు చేసిన కారణంగా అందులో రూ.45.95లక్షలను మాత్రమే హోల్డ్‌లో ఉంచగలిగారు.

నేరగాళ్లకు ముకుతాడు వేసేలా..

గతంలో సైబర్ నేరాగాళ్ల బారిన పడిన బాధితులు పోగొట్టుకున్న నగదును వీలైనంత వరకు రికవరీ చేయడంపైనే దృష్టి సారించిన సైబర్ క్రైం పోలీసులు.. ఈ సారి సైబర్ నేరగాళ్లను గుర్తించి ముకుతాడు వేయాలని భావించారు. అందులో భాగంగా అసలు సైబర్ నేరగాళ్ల నగదు కొట్టేసేందుకు అవసరమైన ఖాతాలపై దృష్టిసారించారు. మొదట్లో సైబర్ నేరాలకు సంబంధించి బాధితుల పోగొట్టుకున్న నగదును ట్రాక్ చేస్తూ వెళ్తున్న పోలీసులకు అసలు విషయం తెలియని అమాయకుల కేవైసీ దొరికేది. అక్కడకు వెళ్లి విచారణ చేస్తే అసలు వారికి అలాంటి ఖాతాలున్నట్టు కూడా తెలియని పరిస్థితులు ఉండేవి. దాంతో ఆయుపట్టుగా ఉన్న అకౌంట్లను బ్లాక్ చేయడం మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో దొంగ ఆధార్ కార్డుల ద్వారా కరెంటు అకౌంట్లు తెరుస్తున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు.. ఆయా అకౌంట్లు తెరిచేందుకు ముడిసరుకును సమకూర్చే వారిని గుర్తించి అరెస్టులు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఆధార్ పేరుతో లోన్లు ఇస్తామంటూ.. ఆయా ఆధార్ కార్డుల ద్వారా కరెంటు అకౌంట్లకు సహకరించిన కొందరిని గతంలోనే అరెస్ట్ చేశారు. అలా దొంగ (మిగతా 6వ పేజీలో)

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయ్..

నగరంలో వివిధ పేర్లతో వెలుస్తున్న మెడికల్ అకాడమీలు

- విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న యాజమాన్యాలు
- అడ్మిషన్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో.. చదువులు అకాడమీల్లో
- కానరాని అధికారుల తనిఖీలు



ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లల భవిష్యత్‌ను బంగారుమయం చేయాలన్న తల్లిదండ్రుల ఆకాంక్షలను కొందరు సొమ్ముచేసుకుంటున్నారు. ముఖ్యంగా మెడికల్ అకాడమీలంటూ ఊదరగొడుతున్నారు. ఈ క్రమంలో ఖమ్మం నగరంలో వివిధ పేర్లతో మెడికల్ అకాడమీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం సుమారు 10 వరకు మెడికల్ అకాడమీలు ఏర్పాటవగా.. కొన్ని ఒకే పేరుతో అనేక బ్రాంచీలను ఏర్పాటు చేస్తూ.. అనుమతులు లేకుండా మెడికల్ అకాడమీలను నిర్వహిస్తున్నారు. ఇల్లెందు రోడ్డులో నాలుగు, వైరా రోడ్డులో మూడు, గట్టయ్య సెంటర్‌లో రెండు, ఎన్నెస్పీ రోడ్‌లో రెండు, ఎన్టీఆర్ సర్కిల్‌లో రెండు.. ఇలా వీధివీధినా మెడికల్ అకాడమీలు పుట్టుకొస్తున్నాయి. అధికారుల నియంత్రణ లేకపోవటం, అది తమ పరిధి కాదంటూ పట్టించుకోకపోవటంతోనే రోజురోజుకు అకాడమీల సంఖ్య పెరుగుతోంది. దీంతో అటు ప్రభుత్వ ఆదాయానికి గం డిపడటంతో పాటు.. ఇటు తల్లిదండ్రులకు ఫీజుల రూపంలో జేబులకు చిల్లు పడుతోంది. ఇక ఆయా అకాడమీల్లో అనధికారికంగా ఇంటర్ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూళ్లు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు.. తమకెందుకునే అన్నట్టు వ్యవహరించటం అనుమానాలకు తావిస్తోంది.

చదువు పేరుతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి

ఇంటర్ విద్యాబోధన, అకాడమీ లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ కోచింగ్ సిలబస్, (మిగతా 6వ పేజీలో)

నేటి నుంచి వ్యవసాయ మార్కెట్ పునఃప్రారంభం

- 26రోజుల అనంతరం తెరుచుకోనున్న ఖమ్మం మార్కెట్
- పత్తి యార్డులోనే క్రయ, విక్రయాలు

ఖమ్మం మార్కెట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత ప్రతీ ఏటా లాగానే సెలవులు ప్రకటించిన ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్ శనివారం నుంచి పునఃప్రారంభం కానుంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు ఎదురవుతున్న క్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, కార్మికుల విజ్ఞప్తి మేరకు ప్రతీ ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా మే 12వతేదీ నుంచి జూన్ 6వతేదీ వరకు వరుసగా 26 రోజులు వేసవి సెలవులు ప్రకటించారు. మార్కెట్ పునఃప్రారంభమవుతున్నా.. పెద్ద, చిన్న యార్డుల్లో ఆధునికీకరణ నిర్మాణ పనులు జరుగుతుండటంతో పత్తి యార్డులోనే పత్తి, మిర్చితో పాటు అపరాలు క్రయ, విక్రయాలు ఉంటాయని మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. రైతులు నేరుగా తమ ఉత్పత్తులను పత్తి యార్డులోకి తీసుకురావాలని ఆయన సూచించారు.

బడి ఈడు పిల్లలను సర్కారు బళ్లో చేర్పించాలి

- ఈ విద్యా సంవత్సరం నుంచి నవోదయ పాఠశాల ప్రారంభం
- బడిబాట ప్రారంభంలో కలెక్టర్
- ఇప్పగింజలను పరిశీలించిన జితేష్
- ఆదివాసీ పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందించిన భద్రాద్రి కలెక్టర్
- ఖమ్మం జిల్లాలో తొలిరోజు అమ్మ ఆదర్శ కమిటీలు సమావేశాలు

6



ఇప్పగింజలను పరిశీలిస్తున్న కలెక్టర్



రామాలయంలో హెవీవాటర్ బోర్డు చైర్మన్, అశ్వాపురం జీఎం

రామయ్యను దర్శించుకున్న హెవీవాటర్ బోర్డు చైర్మన్

కుటుంబ సమేతంగా స్వామివారికి పూజలు

భద్రాచలం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): హెవీవాటర్ బోర్డు చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.సత్యకుమార్ శుక్రవారం భద్రాచలం సీతారామచంద్రస్వామి వారిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆయన వెంట అశ్వాపురం ప్లాంట్ జనరల్ మేనేజరు జి.శ్రీనివాస్ కూడా ఉండగా.. వారంతా ప్రత్యేక పూజలు చేశారు. అలాగే లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వారికి వేద పండితులు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దేశానికి అత్యంత కీలకంగా అశ్వాపురం భారజల కర్మాగారం

రామయ్య దర్శనం అనంతరం హెవీవాటర్ బోర్డు చైర్మన్ కె.సత్యకుమార్ విలేకరులతో మాట్లాడారు. దేశానికి మణుగూరు భారజల కర్మాగారం అత్యంత కీలకమైందని, అమృత్‌కాల్ 2047లో భాగంగా దేశంలోని నాలుగు కీలకమైన మణుగూరు, కోటా, అజీరా, తాల్ హెవీవాటర్ ప్లాంట్ల సామర్థ్యాన్ని మరింతగా పెంచుతున్నామని, ఇందుకు సంబంధించిన పనులు ఇప్పటికే మొదలయ్యాయని తెలిపారు. అలాగే దేశంలో ఇంతకాలం క్యాన్సర్ నిర్ధారణలో వాడే పెట్‌స్కానింగ్‌లో ఉపయోగించే అబ్బర్ ఎటైన్ నీటిని అమెరికా, ఇజ్రాయల్, కువైట్ నుంచి దిగుమతి చేసుకునేవాళ్లమని, ప్రస్తుతం అశ్వాపురం ప్లాంట్‌లో అబ్బర్ ఎటైన్ నీటిని తయారు చేస్తున్నామని, ఇతర దేశాల నుంచి దిగుమతిని నిలిపివేశామన్నారు.అలాగే ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో న్యూక్లియర్ విద్యుత్తు ఉత్పత్తికి ప్రాధాన్యమిచ్చారని, దానికి అనుగుణంగానే మణుగూరు, కోటాలో మరింతగా భారజలం ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. 2047 నాటికి 100 గెగావాట్ల న్యూక్లియర్ విద్యుదుత్పత్తి లక్ష్యంగా ప్రయత్నాలు మొదలుపెట్టామన్నారు. అశ్వాపురం ప్లాంట్‌లో బోరాన్ కార్బైట్ పెల్లట్స్‌ను తయారు చేస్తున్నామని వాటిని రెండోతరం న్యూక్లియర్ విద్యుత్తు తయారీలో ఉపయోగిస్తారని పేర్కొన్నారు.

విచారణ ఏదీ?

- ఉపాధి నిధుల స్వాహాపై చర్యలు శూన్యం
- పాఠశాల నిధులు గోల్‌మాల్‌పై అధికారుల మీనమేషాలు
- అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు కొందరి ప్రయత్నాలు
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



మర్కోడు ఎంపీపీఎస్ పాఠశాల (ఫైల్)

ఆళ్లపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల అభివృద్ధి పనుల్లో భాగంగా ఉపాధి హామీ పథకం ద్వారా ఆళ్లపల్లి మండలం మర్కోడు మండల ప్రాథమిక పాఠశాల ఉపాధి హామీ పనుల్లో రూ.30లక్షల నిధుల స్వాహా వ్యవహారంపై చర్యలు కనిపించడం లేదు. పనులు మొదలు పెట్టకుండానే గ్రామ పంచాయితీ, ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి డబ్బులు స్వాహా చేసిన విషయంపై 'మొత్తం మింగేశారు!' శీర్షికన గత నెల 29న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. అయితే ఉన్నతాధికారుల అనుమతులు, సంతకాలు లేకుండా చేయని పనులకు బిల్లులు సృష్టించడం, వాటిని డ్రా చేయడం ఎలా సాధ్యమైందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై విచారణ నిర్వహించాల్సిన జిల్లా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని, విచారణ చేయకుండా ఈ విషయాన్ని అటకెక్కించే ప్రయత్నాలు చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి అధికారులే అక్రమార్కులను వెనుకేసుకొస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణ పనులు పూర్తయిన తరువాత సంబంధిత అధికారులు పనులను పరిశీలించి కొలతల ఆధారంగా ఎంబీ రికార్డు చేసి, గ్రామ పంచాయతీ స్పెషల్ అధికారి, కార్యదర్శి రికార్డులు పరిశీలించిన అనంతరం ఆ పనులకు సంబంధించి గుత్తేదారుకు చెక్ జారీ చేయడం జరుగుతుంది. ఇరుశాఖల అధికారులు పనులు చేయకుండానే ఏ రూపంలో బోగస్ రికార్డులు సృష్టించారో తెలియదు కానీ, నిధులు విడుదల చేసి స్వాహా చేయడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. విచారణ చేసి నిధులు స్వాహా చేసిందెవరు? ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే వివరాలు ఆరాతీయడం లేదు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని, సొమ్ము రికవరీ చేయకుండానే కథ కంచికి చేర్చే ప్రయత్నాలు జరుతుతున్నాయి.

తప్పు కప్పిపుచ్చేందుకు పనులు ప్రారంభం

పనులు చేయకుండానే నిధులు డ్రాచేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడం తీవ్ర చర్చనీయాంశమైంది. తప్పును కప్పిపుచేందుకు ప్రహరీ, వంటషెడ్డు, మరుగుదొడ్ల పనులు (మిగతా 6వ పేజీలో)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

- పలువురికి గాయాలు
- కొణిజర్ల, నేలకొండపల్లి, కారేపల్లి, పాల్వంచ మండలాల్లో ఘటనలు

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృతిచెందారు. పలువురికి గాయాలయ్యాయి. కొణిజర్ల, తనికెళ్ల గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో వేరుపుల వెంకన్న (50), నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం సమీపంలో ఆటో ప్రమాదంలో ఉమా మహేశ్వరరావు(70), కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో జరిగిన ట్రాలీ ప్రమాదంలో మేకల సీతమ్మ (40), పాల్వంచలో బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో కుంచాల సూర్యనారాయణ (48) మృతి చెందారు.

- ఆంధ్రజ్యోతి, కొణిజర్ల/ నేలకొండపల్లి / కారేపల్లి/ పాల్వంచ/మధిరరూరల్

వివరాలు 7లో...

ఎర్త్‌సైన్స్ వర్సిటీతో మహర్దశ

- కేంద్రం నుంచి పుష్కలంగా సమకూరనున్న నిధులు
- ఈ ఏడాది నుంచే కోర్సులు ప్రారంభమయ్యే అవకాశం
- మన్మోహన్ పేరును సూచించిన మంత్రి తుమ్మల
- సీఎం, మంత్రి వర్గ ఆమోదంతో సర్వత్రా హర్షం



కొత్తగూడెం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ ఆఫ్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలను భద్రాద్రి కొత్తగూడెం ఇటీవల ఎర్త్‌సైన్స్ విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేయడం.. దానికి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరును పెట్టడం.. తద్వారా దేశవ్యాప్తంగా ఈ యూనివర్సిటీకి ప్రత్యేక గుర్తింపు రానుండటంతో ఉమ్మడిజిల్లాకు మహర్దశ రానుంది. ఇప్పటికే ఖనిజ వనరులు .. అపార వనరులున్న ఈ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఎర్త్‌సైన్స్ వర్సిటీతో ఖ్యాతి మరో మెట్టు పెరగనుంది. అయితే గతంలో ఉన్న మైనింగ్ కళాశాలను ఎర్త్‌సైన్స్ విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేయిండం నుంచి వర్సిటీకి మాజీప్రధాని, ప్రముఖ ఆర్థిక వేత్త మన్మోహన్‌సింగ్ పేరును ఖరారు చేసే వరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంతో కీలకంగా వ్యవహరించారు. వర్సిటీకి మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాలన్న ప్రతిపాదనను తుమ్మల.. సీఎం రేవంత్ వద్ద పెట్టగా.. దానికి సీఎంతో పాటు మంత్రి మండలి ఆమోదం తెలపడంతో మంత్రి తుమ్మల ఆనందం వ్యక్తం చేశారు. అలాగే మాజీ ప్రధాని పేరును ఎర్త్‌సైన్స్ వర్సిటీకి పెట్టడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

కేంద్ర నుంచి ప్రత్యేక నిధులు..

ఈ యూనివర్సిటీలో పలు రాష్ట్రాల విద్యార్థులు చదివి భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదిగే అయ్యే అవకాశాలున్న నేపథ్యంలో భద్రాద్రికి అంతర్జాతీయ ఖ్యాతి దక్కనుంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా ప్రతిష్టాత్మకమైన ఈ యూనివర్సిటీకి ప్రత్యేక నిధులు సమకూరే అవకాశాలున్నాయి. ఏజెన్సీప్రాంతం.. నక్సల్ ప్రభావిత జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నుంచి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పథకం కింద ప్రత్యేక నిధులు మంజూరవుతున్నాయి. మున్ముందు ఈ యూనివర్సిటీకి కూడా వందల కోట్ల నిధులు మంజూరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ఈ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ఈ ఏడాది నుంచే కోర్సులను కూడా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రతీ కోర్సులో 60సీట్ల చొప్పున మొత్తం 780సీట్లను కేటాయించనున్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి శంకుస్థాపన

మధిరరూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధిర నియోజకవర్గ అభివృద్ధికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పెద్దపీట వేస్తున్నారన్నారు. సొసైటీ చైర్మన్ కోట వెంకటకృష్ణ, నాయకులు కర్నాటి రామారావు, బొమ్మకంటి హరిబాబు, అయితం ప్రసాద్, నన్నబోయిన గంగరాజు, వూట్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలాన్ని సర్వేచేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

మధిరరూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన గ్రామస్థులు స్థానిక సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో హిందూ స్మశానవాటిక స్థలాన్ని సర్వేచేసి హద్దులు నిర్ణయించాలని గ్రామపెద్దలు విజయరాజు, మేనుగు శంకర్, పాండు, పుల్లయ్య తదితరులు వినతిపత్రం అందించారు. స్పందించిన తహసీల్దార్ స్మశాన వాటిక స్థలాన్ని సర్వేచేసి హద్దులు నిర్ణయిస్తామన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీహెచ్‌వో

మధిరటౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీసీహెచ్‌ఓ రాజశేఖర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మధిర ప్రభుత్వ ఆసుపత్రిలో సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు, వర్షాకాలం ప్రారంభమవుతున్నందున పట్టణాల్లో, గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు మందులు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్, పంచాయతి సిబ్బందితో సమన్వయం చేసుకుని కాలువల్లో మురుగు నీరు నిల్వ లేకుండ చూడాలని కోరారు. మధిర సివిల్ ఆసుపత్రి సూపరండెంట్ డా.అనిల్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9న గౌడ కన్వెన్షన్ హాల్‌కు శంకుస్థాపన



డాక్టర్ దయానంద్‌కు ఆహ్వానం ఇస్తున్న నాయకులు

సత్తుపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నియోకవర్గంలోని రఘునాథపాలెంలో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించిందని, ఈ స్థలంలో గౌడ కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి ఈ నెల 9న శంకుస్థాపన జరగనుందని ఆ సంఘం నాయకులు తెలిపారు. శంకుస్థాపన ఆహ్వాన పత్రికను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌కు శుక్రవారం సత్తుపల్లిలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌడ్ కన్వెన్షన్ హాల్ శంకుస్థాపనకు రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లాకు చెందిన మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్, బండి సాయన్న హాజరవుతారని తెలిపారు. శంకుస్థాపనకు పెద్ద సంఖ్యలో గౌడ ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. చింతలపాటి సత్యనారాయణ గౌడ్, చల్లపల్లి చక్రవర్తిగౌడ్, బజాజూరి వెంకటేశ్వరరావుగౌడ్, కట్టా శివాజి, వంగా చంద్రశేఖర్, దొంతు శేషగిరిరావు, నాయుడు వెంకటేశ్వరరావు, గోదా నరసింహారావు, కత్తి నెహ్రూ, గుడిద శ్రీనివాస్, మార్కం లింగయ్య, పొట్లపల్లి శేషగిరారావు, గునుగుంట్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

ముదిగొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భూ భారతి రెవెన్యూ సదస్సులు శుక్రవారం నాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. మండలంలోని ఖానాపురం, గంధసిరి, నర్సాపురం రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో రైతులు భూ రికార్డు సమస్యలకు సంబంధించి 59మంది దరఖాస్తులను తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకి అందజేశారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

ముదిగొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): యువత మద్యం, మత్తుపదార్థాలు వంటి చెడువ్యసనాలకు దూరంగా డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన యువచైతన్య సైకిల్ యాత్ర శుక్రవారం సాయంత్రం ముదిగొండకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగం పెరుగుతోందన్నారు. యువచైతన్య సైకిల్ యాత్ర గ్రామగ్రామాన తిరుగుతూ యువతకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు సృష్టించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో యాత్ర రథసారథులు డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దాల ప్రభాకర్, బషీరుద్దీన్, నాయకులు బొడ్డు మధు, రావులపాటి నాగరాజు, గుమ్మా ముత్తారావు, బట్టు రాజు, సతీష్, దస్తగిరి, లక్ష్మణ్, వీరబాబు, రవి సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, వ్య.కా.స మండల కార్యదర్శి వేల్పుల భద్రయ్య పాల్గొన్నారు.

ఇక్కడ విచారణలే..చర్యలుండవు..

- ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లలో తప్పిదాలపై చర్యలేవీ..?
- వరుస సంఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోరు..
- పత్రికా కథనాలపై కొందరు వైద్యుల రహస్య సమావేశం



సత్తుపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలో కొన్ని ప్రైవేటు ఆసుపత్రులలో ఇటీవల కాలంలో వైద్యం వికటించి రోగులు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలపై వైద్యఆరోగ్య శాఖ విచారణ చేసినట్లు హడావిడి చేయడమే తప్ప నెలలు గడుస్తున్నా సదరు ఆసుపత్రులపై తీసుకున్న చర్యలు మాత్రం ఏమీ లేవని పట్టణంలో పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని ప్రైవేటు ఆసుపత్రులతో రోగులకు వైద్య వికటించి మృతి చెందడం, వాటిపై ఆందోళనలు జరిగిన విషయం విదితమే. సంఘటన జరిగిన వెంటనే చనిపోయిన రోగుల బంధువులతో కొందరు వైద్యులు రంగంలోకి దిగి సెటిల్‌మెంట్ చేసుకోవడం పరిపాటిగా మారింది. జరిగిన సంఘటనలు పత్రికల్లో వెలువడిన వెంటనే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ పేరుతో సదరు ఆసుపత్రుల్లో హడావిడి చేయడం ఆ తరువాత విచారణ అటకెక్కటం అలవాటుగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాజాగా ల్యాబ్‌లో విచారణ

సత్తుపల్లిలో ఒక ల్యాబ్ యజమాని ఒక గర్భిణీ స్కానింగ్ రిపోర్టును మరో గర్భిణీకి మార్చి ఇవ్వటం రిపోర్టును సరిగా చూడకుండా సదరు డాక్టర్ కూడా మందులు రాయడంతో ఒక మహిళ తీవ్రంగా ఇబ్బంది పడిన విషయం విదితమే. అలాగే తీవ్ర అనారోగ్య సమస్యకు గురైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటకు చెందిన మహిళ ఖమ్మం జిల్లా కలెక్టర్ సహా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ణికి, ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే ల్యాబ్‌లో రిపోర్టులు తప్పుగా ఇవ్వడంతోపాటు ఒక పరీక్షకు బదులు మరో పరీక్ష చేయడంతో ఇక్కడ గొడవలు జరిగాయి. తప్పుడు రిపోర్టు ఇచ్చిన సందర్భంలో రోగులు అడిగితే వారిపై ఘర్షణకు కూడా దిగుతున్నారని కొందరు రోగులు ఆరోపిస్తున్నారు. అయినా పట్టణంలో తన పలుకుబడిని ఉపయోగించి సదరు ల్యాబ్ యజమాని పలు సందర్భాల్లో సెటిల్‌మెంట్ చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

విచారణ అటకెక్కినట్లేనా....

ఇటీవల ఇదే ల్యాబ్ ఎదురుగా ఉన్న ఆసుపత్రికి ఒక మహిళను ఆపరేషన్ కోసం సిఫారసు చేయగా అక్కడ అర్హత లేని వైద్యుడుతో ఆపరేషన్ చేయించడంతో ఆ మహిళ మృతి చెందిన సంఘటన విదితమే. దీనిపై కూడా విచారణ జరిగింది. సదరు ఆసుపత్రికి ఆపరేషన్లు అనుమతి లేకున్నా చేయడంతో మహిళ మృతి చెందినట్లుగా విచారణలో తేలింది. అయినా ఆ ఆసుపత్రి బోర్డు ఇప్పటికీ మార్చలేదు. ల్యాబ్‌లో రిపోర్టులు మారిన సంఘటనపై కూడా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సీతారాం ఎప్పటిలానే విచారణ జరిపారు. ఈ విచారణ కూడా అటకెక్కినట్లేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ల్యాబ్‌కి సంబంధించిన అనుమతులను 2023 తరువాత అధికారులు రెన్యువల్ చేయలేదు. అయినా అధికారులెవరూ పట్టించుకోలేదు.

వరుస సంఘటనలపై రహస్య సమావేశం

సదరు ల్యాబ్ యజమానిపై చర్యలు లేకుండా చేసేందుకు కొందరు వైద్యులు రంగంలోకి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా తమ పలుకుబడిని ఉపయోగిస్తున్నారని అంటున్నారు. ఈ క్రమంలో పట్టణంలో జరుగుతున్న సంఘటనలు, విచారణలతో పాటు పత్రికల్లో కథనాలకు సంబంధించి కూడా వైద్యులు కొందరు రహస్య సమావేశం ఏర్పాటు చేసి చర్చించినట్లు సమాచారం. ఈ క్రమంలో జరిగిన విచారణలపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

నివేదిక పంపాం-డిప్యూటీ డీఎంహెచ్‌వో

ల్యాబ్‌లో రిపోర్టులు మారిన అంశంపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సీతారాం చెప్పారు. నివేదికను అధికారులు పరిశీలించి తరుపరి చర్యలు తీసుకుంటారని చెప్పారు. ల్యాబ్ రెన్యువల్ కోసం యజమాని చలాన్ 2023లోనే కట్టారని అన్నారు. ఇప్పటి వరకూ ఎందుకు రెన్యువల్ కాలేదనేది మాత్రం స్పష్టత లేదు.

మునిసిపాలిటీలో వందరోజుల ప్రణాళిక



పూడిక తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్

మధిరటౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మధిర మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక చేపట్టినట్లు కమిషనర్ సంపత్ కుమార్ తెలిపారు. శుక్రవారం మధిర పట్టణంలోని 18వ వార్డులో వంద రోజుల ప్రణాళికలో భాగంగా జరుగుతున్న పూడిక తొలగింపును పర్యవేక్షించారు. మున్సిపాలిటీలో మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రత, కాలువలలో పూడిక తొలగించడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శానిటరీ ఇనస్పెక్టర్ రామకృష్ణ మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట



కొణిజర్లలో ర్యాలీ తీస్తున్న దృశ్యం

కొణిజర్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొణిజర్లలో శుక్రవారం అంగన్‌వాడి కేంద్రాల ఆధ్వర్యంలో అమ్మమాట-అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడి కేంద్రాల చిన్నారులు, తల్లులతో గ్రామంలో ర్యాలీ తీశారు. ఏసీడీపీవో ఉషారాణి, సూపర్‌వైజర్ కె.జ్యోతి, అంగన్‌వాడి టీచర్‌లు కృష్ణవేణి, ఉమారాణి, రాంబాయి, శారద పాల్గొన్నారు. మండల పరిధిలోని తనికెళ్ళ గ్రామంలో కూడా ర్యాలీ తీశారు. సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ, అంగన్‌వాడి టీచర్‌లు శివరంజని, ఝాన్సీరాణి, పిచ్చమ్మ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ప్రసంగిస్తున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 11 ఏళ్లలో అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించాలని ఆ పార్టీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం సత్తుపల్లిలో పట్టణ అధ్యక్షుడు బానోత్ విజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సత్తా ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరును ప్రపంచం కొనియాడుతోందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీ నాయకులు ఆచంటి నాగస్వామి, షేక్ రహంతుల్లా, మమంద శివయాదవ్, సుబ్రహ్మణ్యం, వంశీకృష్ణ, జోనబోయిన కార్తీక్, మెరిగు శేషగిరిరావు, బుచ్చిరెడ్డి విజయ్‌రెడ్డి, బట్టి శివసాయి యాదవ్, చీకటి వసంతరావు, వంశీ పాల్గొన్నారు.

ఎస్‌ఐపై దురుసుగా ప్రవర్తించిన యువకులు

కల్లూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న మహిళ ఎస్‌ఐపై శుక్రవారం రాత్రి తల్లాడ మండలానికి చెందిన ఆరుగురు యువకులు దురుసుగా ప్రవర్తించిన సంఘటనపై కల్లూరు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. స్థానికంగా తిరువూరు క్రాస్ రోడ్‌లో ఉన్న చౌదరి హోటల్ వద్దకు తల్లాడకు చెందిన ఆరుగురు వ్యక్తులు ప్రవేశించి చపాతీలు ఇవ్వాలని ఆదేశించారు. ఆ సమయంలో చపాతీలు లేవని హోటల్ సిబ్బంది చెప్పగా వారు మద్యం సేవించిన మత్తులో యాజమానిపై ఘర్షణకు దిగారు. ఈ సంఘటనపై సదరు హోటల్ యాజమాని స్థానిక మహిళ ఎస్‌ఐ హరితకు సమాచారం అందించగా వెంటనే స్పందించి హోటల్ వద్దకు వచ్చి సదరు యువకులను సమాచారం అడిగి తెలుసుకునే ప్రయత్నం చేస్తుండగా మద్యం మత్తులో ఉన్న ఆ యువకులు మహిళ ఎస్‌ఐ అని చూడకుండా ఎదురు తిరిగి వాదనకు దిగినట్లు తెలిసింది. ఆ సమయంలో ఓ యువకుడు మహిళ ఎస్‌ఐని తోసేసినట్లు తెలిసింది. నిందితులను పెనుబల్లి సర్కిల్ పోలీసుస్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు ఎస్ హరిత తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం భగవాన్‌నాయక్‌తండా గ్రామ రెవెన్యూ సదస్సులో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు దశలవారీగా అర్హులందరికి అందిస్తామన్నారు. భూ భారతితో రైతుల సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

గ్రామసభ ఏర్పాట్లుపై ఎమ్మెల్యే ఆగ్రహం

గ్రామసభ ఏర్పాట్లుపై ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అసంతృప్తి వ్యక్తంచేవారు. గ్రామసభలో ఫ్లెక్సీలు, కుర్చీలు ఎందుకు ఏర్పాటుచేయలేదని గ్రామపంచాయతీ కార్యదర్శి మౌనికపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే సస్పెండ్‌కు ఆదేశిస్తాని హెచ్చరించారు గ్రామసభలకు అన్ని శాఖల అధికారులు ఎందుకు హాజరుకావడంలేదని అసహనం వ్యక్తంచేశారు. ఇక నుంచి అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఎంపీడీవో జీవీఎస్ నారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణనరేంద్రకుమార్, మండల నాయకుడు ధర్మారావు, పూర్ణకంటి మైసారావు పాల్గొన్నారు.

ఏన్కూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైనవైద్య సేవలందిస్తూ ప్రజాసేవ చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఏన్కూరులో కొలిశెట్టి నరేష్ ఏర్పాటుచేసిన గాయత్రి హాస్పిటల్‌ను కొత్తగూడెం ప్రముఖ వైద్యులు నాగరాజుతో కలిసి ప్రారంభించారు . ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయత్రి హాస్పిటల్ డాక్టర్ నరేష్ చేస్తున్న సేవలను అభినందించారు. నరేష్ దంపతులు దాతృత్వంతో అందిస్తున్న రూ.30వేల విలువైన ఎలక్ట్రికల్ వీల్‌చైర్‌ను కారేపల్లి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు సురేష్‌కు ఎమ్మెల్యే చేతులమీదుగా అందించారు. మండలపార్టీ అధ్యక్షడు స్వర్ణనరేంద్రకుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వడ్డే నారాయణ, మండల నాయకుడు మేడా ధర్మారావు, పూర్ణకంటి మైసారావు, పటాన్ మజీద్‌ఖాన్, నల్లమలశివకుమార్, వానిరెడ్డి నాగేశ్వరరావు , లచ్చిరాంనాయక్, వీరునాయక్, లాలునాయక్, నిమ్మల నాగేశ్వరరావు, పంతగాని నరేష్, సాయి, శేఖర్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వైరా, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వైరాలోని జాతీయ ప్రధాన రహదారిలో దాదాపు ఏడాదిన్నర కాలంగా ప్రవహిస్తున్న డ్రెయినేజీ మురుగునీటి సమస్యకు వెంటనే ముగింపు పలకాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మున్సిపల్ కమిషర్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వైరా మునిసిపాలిటీ 8వ వార్డు పరిధిలోని బ్రాహ్మణపల్లి అగ్రహారంలోని గంధం టవర్స్ నుంచి వెలువడిన మురుగునీరు డ్రెయినేజీ లేక రోడ్డుపైనే ప్రవహిస్తున్న తీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే గంధం టవర్స్, పోలీస్‌స్టేషన్, బ్రాహ్మణపల్లి ప్రాంతాల్లో రోడ్డుపై కలియతిరిగి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని తొలగించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. డ్రెయినేజీ నిర్మాణానికి రూ.31లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ముందుగా ఈ మురుగునీటిని పోలీస్‌స్టేషన్ సమీపంలోని డ్రెయినేజీలోకి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. స్థానిక మాజీ సర్పంచ్ అయిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ డీఈఈ, ఏఈఈలు పాల్గొన్నారు.

పార్టీ పటిష్ఠతకు అందరూ కృషి చేయాలి

వైరా, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర, దేశ స్థాయి వరకు ఉన్న సమస్యల పరిష్కారం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. వైరా మండలంలోని దాచాపురం, గరికపాడు, లింగన్నపాలెం, విప్పలమడక సహా పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ గ్రామకమిటీల ఎన్నికలు జైబాపూ.. జైభీమ్.. జై సంవిధాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పార్టీ సంస్థాగత నిర్మాణాలపై ఆయన మాట్లాడారు. పార్టీ నిర్మాణంలో బూత్‌స్థాయి నుంచి గ్రామస్థాయి అధ్యక్షుల పాత్ర కీలకమన్నారు. స్థానికులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు పనిచేయాలని తద్వారా పార్టీకి ప్రజలను చేరువ చేసి పటిష్టం చేయాలని సూచించారు. కాంగ్రెస్ రాజ్యంలో అన్నివర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఎన్నికైన గ్రామకమిటీలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. టీపీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, వైరా ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే.రత్నం, ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, నాయకులు మచ్చా బుజ్జి, మట్టూరి వెంకటేశ్వరరావు, పమ్మి అశోక్, బొళ్ల గంగారావు, పొట్టపల్లి శ్రీను, గంగరాజుపాల్గొన్నారు.

విద్యుత్ పంపిణీలో లోపాలను నివారించడమే లక్ష్యం



వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో మాట్లాడుతున్న వేణుగోపాలచారి

బోనకల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఎదురయ్యే సేవా లోపాలను పరిష్కరించడమే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక లక్ష్యమని కన్స్యుమర్ గ్రీవేన్ రిడ్రెస్సెల్ ఫోరం-1(సీజీఆర్‌ఎఫ్) చైర్ పర్సన్ ఎన్.వి.వేణుగోపాలచారి తెలిపారు. బోనకల్ రైతు వేదిక కార్యాలయంలో శుక్రవారం వైరా సబ్ డివిజన్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నందు గత 2005లో ఏర్పాటు చేయబడిన ఈ ఫోరంకు రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ చైర్ పర్సన్‌గా వ్యవహరిస్తారు. మరో ముగ్గురు సర్వీసులో ఉన్న ఉన్నతస్థాయి అధికారులు మెంబర్లుగా ఉంటారు. వీరు ఏర్పాటు చేసిన పరిష్కార వేదికలో ఆళ్లపాడు గ్రామానికి చెందిన రైతు మరీదు వేణు తాను 2016లో పొలంలో విద్యుత్ మోటారు సర్వీసు కనెక్షన్ కొరకు డీడీ కట్టానని తెలిపారు. అధికారులు విద్యుత్ స్తంభాలు, వైర్లు ఇచ్చినా కనెక్షన్ కలపలేదని, తానే ఆ పని చేసుకుందామని ప్రయత్నం చేసే క్రమంలో గ్రామంలోని కొందరు అడ్డు తగిలారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన తండ్రి దివ్యాంగుడని, పరిస్థితిని చూసి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు. ఇలా పలు సమస్యలను వినియోగదారులు ఫోరం దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం చైర్ పర్సన్ వేణుగోపాలచారి మాట్లాడుతూ.. వినియోగదారులు విద్యుత్ సేవల విషయంలో జాప్యం జరిగితే ఆధారాలతో తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ మీటర్లలో లోపాలకు సంబంధించిన సమస్యలు, బిల్లులు, వోల్టేజీ హెచ్చు తగ్గులు, క్యాటగిరి మార్పు, యజమాని పేరు మార్పిడి అంశాలు, లోడు వివాదం, పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ వివాదాలతో పాటు విద్యుత్ చౌర్యానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించే విదంగా సేవలందిస్తామని తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యలను ఫోరంకు ఎలాంటి ఫీజు లేకుండా ఫిర్యాదు చేయవచ్చునని, వాట్సప్ నంబర్లు 8712481311, 8712481314, 8712481316 ద్వార కూడ పంపవచ్చునని తెలిపారు. ఫోరం మెంబర్లు కె. రమేష్, ఆర్. చరణ్‌దాస్, ఎం. రామారావు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

» సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లిలో ఆమె బడి బాట కార్యక్రమాన్ని ప్రారంభించి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. ఇప్పటికే చదువు మానేసిన వారిని కూడా తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. చదువుతోనే పిల్లకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వైరా, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తాము పని చేస్తున్న పాఠశాలల పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం మొదలుకొని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన చేస్తున్నామని, ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రెబ్బవరం బడిబాటలో ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నార

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

» ఆర్డీవో రాజేంద్రగౌడ్



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

పెనుబల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భూ భారతితోనే భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కల్లూరు ఆర్డీవో రాజేంద్ర గౌడ్ తెలిపారు. పెనుబల్లి రైతు వేదికలో శుక్రవారం జరిగిన భూ భారతి రైతు సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ కోసం సెక్షన్-5, రూల్-5, షెడ్యూల్-బీ ప్రకారం కొనుగోలు, దానం, తనఖా బదిలీ, భూ పంపకాలపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డుల్లో మార్పులు చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేస్తారని, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ఒకేరోజు జరుగుతాయని తెలిపారు. స్లాట్ బుకింగ్, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ఫీజు చెల్లింపు అంతా ఒకేరోజు జరుగుతుందని దీనికోసం రిజిస్ట్రేషన్ స్థిరాస్తి చట్టం ప్రకారం సొంత దస్తావేజు రాసుకుని తహసీల్దార్‌కు సమర్పించాలని సూచించారు. రికార్డుల్లో తప్పుల సవరణకు సెక్షన్-4, రూల్-4, షెడ్యూల్-ఏ ప్రకారం రికార్డుల్లో తప్పులు సవరణలు, భూహక్కులు, భూరికార్డుల్లో లేనివారు హక్కులు భూ రికార్డుల్లో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిందని దీని ప్రకారం ఏడాదిలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణమూర్తి, ఆర్‌ఐలు విజయభాస్కర్, సంపత్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.